సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 3-10-2025 ₹15/-


## శుద్ధి చేసేద్దాం








## హృదయం

మనిషి భవిష్యత్తును నిర్ణయించే కేంద్రం




అరబ్‌నాటో-ముస్లిం దేశాల ఐక్యతారాగం

గీటురాయి వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 38 హైదరాబాద్
శుక్రవారం 3 అక్టోబర్ 2025 రూ.15-00
రబీ ఉస్సాని 10 1447 హిజ్రీ


**తొలిగీటు**

**ఒక వ్యక్తి ఇంకో వ్యక్తికి సహాయం చేస్తున్నంత వరకు అల్లాహ్ అతనికి సహాయం చేస్తూనే ఉంటాడు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com





16

**అఫ్జల్‌భాయ్‌కి ఆత్మీయ నివాళి**

## లోపల...


| | |
|---|---|
| ఒక ఐఫోన్ కోసం ...... | 04 |
| శుద్ధి చేసేద్దాం ...... | 05 |
| అరబ్ నాటో: ముస్లిం దేశాల ఐక్యతారాగం? ...... | 08 |
| మహనీయ సయీద్ బిన్ జైద్ (రజి) – 2 ...... | 10 |
| ఫోన్ సమయాన్ని తగ్గించుకోవటం ...... | 13 |
| హృదయం – మనిషి భవిష్యత్తును నిర్ణయించే కేంద్రం ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) ...... | 19 |
| నమ్మక ద్రోహం ...... | 20 |
| అల్లాహ్ నామంతో ...... | 23 |
| ఔషధ నిపుణుల దినోత్సవం ...... | 24 |
| ప్రవక్త అడుగుజాడల్లోనే సాఫల్య పథం ...... | 27 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |


**సిగ్గు లేకపోతే సరి!**




ఎప్పుడేకమయ్యేనో
ఈ అరబ్బు దేశాలు
సిగ్గు లేదు శరం లేదు
వేస్తున్నరు వేషాలు!
వినిపించుట లేదంట
గాజాలో ఆర్తనాదాలు
తగుల్తయి తప్పకుండ
పీడితుల శాపనార్థాలు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

## ఆలోచన

# ఒక ఐఫోన్ కోసం

**దేశంలో** యువతరానికి ముఖ్యంగా జెన్ జి అని పిలువబడే వారికి ఐఫోన్ మోజు తప్ప మరొకటి లేదేమో అనిపిస్తుంది. ప్రతి సంవత్సరం కొత్త మోడల్ కొనడం కొందరిలో ఒక వ్యసనంగా మారింది. అప్పులిచ్చే కొన్ని యాప్‌లు కూడా ఈ రకం ఖర్చులకు వెంటనే రుణాన్నిస్తాయి. దాదాపు 22 శాతం అంతకన్నా ఎక్కువ వడ్డీ రేటుతో అప్పు చేసి మరీ యువత ఐఫోన్ కొనడానికి రోజుల తరబడి క్యూలో వేచి ఉండడానికి కూడా సిద్ధంగా ఉంది. నెలకు పాతికవేల జీతం సంపాదించుకునే ఒక సగటు మధ్యతరగతి జీవి మూడు నాలుగు నెలల జీతం డబ్బు కూడా ఒక ఐఫోన్ కొత్త మోడల్ కొనడానికి చాలదు. అందువల్ల అప్పు చేయక తప్పదు. ఈ పిచ్చినేమనాలి.

బ్యాంకేతర ఆర్థిక సంస్థల నుంచి అధిక వడ్డీ రేట్లపై వారు అప్పు చేసి మరీ కొంటున్నారు. అప్పు తీర్చడానికి నానా కష్టాలు పడడం మామూలే.

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో అప్పులిచ్చే ప్రకటనలు కనబడగానే అప్పులు చేస్తున్నారు. ఇలా అప్పులు చేసేవారంతా ఈ ఖరీదైన అలవాట్ల వ్యసనంతో అప్పులు చేస్తున్నారనుకుంటే పొరబాటు, వైద్యఖర్చుల కోసం తప్పనిసరి అవసరాల కోసం అప్పులు చేసేవారు కూడా ఉన్నారు. ఎవరు దేనికోసం అప్పు చేసినా ఒక నెల వాయిదా చెల్లించకపోతే రికవరి ఏజెంట్లు బంధువులకు కూడా ఫోన్లు చేసి పరువు బజారుకీడ్చి అప్పు వసూలు చేసే ప్రయత్నాలు చేస్తారు.

ఈ అప్పులిచ్చే యాప్‌లు కూడా వ్యసనంగా మారిపోతాయి. వ్యసనం అప్పులిచ్చే యాప్‌లు మాత్రమే కాదు, ఖరీదైన వస్తువులు కొనాలనుకోవడం కూడా ఒక వ్యసనమే. నిజానికి ఐఫోన్ కొత్త మోడల్ కొనవలసిన అవసరం సగటు మొబైల్ వినియోగదారునికి ఉండదు. హై ఎండ్ ప్రాసెసర్, గ్రాఫిక్ కార్డులు ఉపయోగించవలసిన అవసరమేమీ ఉండదు. అసలు చాలా మంది కొత్త ఐఫోన్‌లో ఉన్న ఫీచర్లేమిటో తెలియకపోయినా సరే మోజుతో కొంటుంటారు. అధికవడ్డీకి అప్పు చేసైనా సరే పుట్టినరోజు పార్టీ చేసుకునేవారు కొందరు. గోవా ట్రిప్ కోసం లేదా మరోచోటికి సరదాగా వెళ్ళడానికి అప్పులు చేసేవారు మరికొందరు.

రుణ యాప్‌ల సంఖ్య పెరుగుతోంది. ఒక యాప్ నుంచి రుణం తీసుకుని అది చెల్లించడానికి మరో యాప్ నుంచి మరింత రుణం తీసుకుని – ఇలా విషవలయంలో చిక్కుకుపోతున్నారు. భారతదేశంలో ఐఫోన్ కొనేవారిలో 70 శాతం మంది నెలసరి వాయిదాలతో కొంటున్నారని 2022లో వచ్చిన ఒక నివేదిక చెబుతోంది. అంటే ఐఫోన్ కొనేవారిలో అత్యధికులు సగటు వేతన జీవులే.

ఇవి వృధా ఖర్చులు. కుటుంబ అవసరాలు, పిల్లల చదువుల కోసం ఖర్చు పెట్టవలసిన సొమ్మును, నిరుపేదలు, అవసరమున్న వారి కోసం ఖర్చు పెట్టవలసిన సొమ్మును ఇలా వృధాగా ఖర్చు చేయడం ఎంత వరకు సమంజసం? దివ్యఖుర్ఆన్ స్పష్టంగా ఈ పని ఎలాంటిదో చెప్పింది:

**"వృధా ఖర్చు చెయ్యకండి. వృధా ఖర్చు చేసేవారు షైతాను సోదరులు." (బనీ ఇస్రాయీల్: 27)**

అబ్దుల్ వాహెద్




కాన్పూర్‌లో మీలాదున్నబీ సందర్భంగా పోలీసులు ముస్లిం యువకులు కొందరిని అరెస్టు చేశారు. పోలీసుల చర్యకు నిరసనగా ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎదుట ముస్లిం మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ శాంతియుత నిరసనకు ప్రసిద్ధ ఉర్దూ కవి మునవ్వర్ రానా కుమార్తె సుమయ్యా రానా నాయకత్వం వహించారు.

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ వివాదం మొదలైంది. ఉత్తరాఖండ్, తెలంగాణ, మహారాష్ట్ర సహా అనేక రాష్ట్రాల్లో ముస్లిం సమాజం భారీ ఎత్తున నిరసనలు చేపట్టే పరిస్థితికి దారి తీసింది. ర్యాలీలు, ప్రదర్శనలు జరిగాయి. కొన్ని చోట్ల పోలీసులతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

అసలీ వివాదానికి కారణమేమిటి? అనేది ఆలోచించవలసిన ప్రశ్న.

సెప్టెంబర్ 4న కాన్పూర్‌లోని రావత్‌పూర్‌లో మీలాదున్నబీ ఊరేగింపు జరిగింది. ప్రస్తుతం దేశంలో ప్రతి పండుగలో ఒక ఊరేగింపు తప్పనిసరై పోయింది. ఊరేగింపు దారిలో I Love Muhammad అని రాసిన బ్యానర్ పెట్టారు. మీలాదున్నబీలో ఊరేగింపు అవసరమా? అనే ప్రశ్న తార్కికమూ, తాత్వికమూ అయినది కాబట్టి ఈ తర్కవితర్కాల్లోకి వెళ్ళాల్సిన అవసరం ఇక్కడ లేదు.

అనేక పండుగల సందర్భంగా ఊరేగింపులు జరగడం దేశంలో కొత్త కాదు. ఇది నేడు ప్రారంభమైంది కూడా కాదు. ఈ ఊరేగింపులు సాధారణ ప్రజా జీవనంలో సృష్టించే సమస్యలు కూడా కొత్త కాదు. కాని ఇది కేవలం ముస్లిములు మాత్రమే చేస్తున్నారనడం పెద్ద అబద్ధం. ఇలా బ్యానర్లు పెట్టడం కూడా కొత్తేమీ కాదు. ప్రతి పండుగ సందర్భంగా అనేక బ్యానర్లు వెలుస్తూనే ఉంటాయి. కాని కాన్పూర్‌లో మీలాదున్నబీ సందర్భంగా బ్యానర్ పెడితే కొన్ని హిందూ సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రస్తుత ప్రభుత్వం, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లిములకు వ్యతిరేకంగా ఒక ఫిర్యాదు వస్తే పోలీసులు ఆఘమేఘాలపై చర్యలు తీసుకోవడం మామూలే అని చాలా మంది వ్యాఖ్యానిస్తున్న మాటల్ని నిజం చేస్తూ పోలీసులు తక్షణం జోక్యం చేసుకున్నారు. కొందరిని అరెస్టు చేశారు.

అరెస్టుల తర్వాత ఆందోళన చెలరేగింది. ఐ లవ్ ముహమ్మద్ అనడంపై అరెస్టులు చేయలేదని, మీలాదున్నబీ సందర్భంగా కొత్త సంప్రదాయంగా బ్యానర్ పెట్టినందుకు అరెస్టు చేశామని పోలీసులు చెబుతున్నారు. బ్యానర్ పెట్టడం కొత్త సంప్రదాయమా? ప్రతి మతస్తుల పండుగలో పాత సంప్రదాయాలు తప్ప కొత్త సంప్రదాయాలు పాటించకుండా ఇలాగే పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటూ అరెస్టులు చేస్తున్నారా?

మనదేశంలో అన్నీ విచిత్రాలే జరుగుతుంటాయి. భారతదేశం ఐక్యరాజ్యసమితిలో మొన్న పాలస్తీనాకు మద్దతుగా ఓటు వేసింది. కాని ఉత్తరప్రదేశ్‌లో పాలస్తీనాకు మద్దతుగా పోస్టర్లు పెట్టినందుకు యోగి ప్రభుత్వ పోలీసులు అరెస్టులు చేశారు. ఎందుకంటే వారిపై ఒక హిందూ సంస్థ ఫిర్యాదు చేసింది. పాలస్తీనా అంటే ద్వేషం వెళ్ళగక్కడం కూడా ఇప్పుడు మామూలైపోయింది. ప్రపంచం మొత్తం ఇప్పుడు పాలస్తీనాకు మద్దతుగా మాట్లాడుతుంటే, స్వయంగా మోడీ ప్రభుత్వం కూడా ఐక్యరాజ్యసమితిలో పాలస్తీనాకు మద్దతుగా ఓటేసిన నేపథ్యంలో కూడా ఇస్రాయీల్ తమ మేనత్త కొడుకన్నట్లు మాట్లాడేవాళ్ళు ఇక్కడ చాలా మంది ఉన్నారు.

ఏది ఏమైనా సెప్టెంబర్ 9న మీలాదున్నబీ సందర్భంగా కాన్పూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సోషల్ మీడియాలో I Love Muhammad అనడం నేరం కాదని పేర్కొన్నారు. కాన్పూర్ పోలీసులను ట్యాగ్ చేస్తూ, వారి చర్యను విమర్శించారు. దీంతో మరింత చర్చ రగిలింది. ఆ తర్వాత నిరసనలు ఉన్నావ్ తదితర ప్రాంతాలకు విస్తరించాయి. ఉన్నావ్‌లో ఘర్షణలు జరిగాయి. పోలీసులు గాయపడ్డారు. దీంతో ఎనిమిది ఎఫ్ఐఆర్‌లు, ఐదు అరెస్టులు జరిగాయి. బరేలీలో I Love Muhammad పోస్టర్లు తొలగించడంపై స్థానికులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. గుజరాత్‌లో గోధ్రా వద్ద నిరసనల సమయంలో పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారని 17 మందిని అరెస్ట్ చేసి, మరో 80 మందిపై కేసులు నమోదు చేశారు. లక్నోలోని విధాన్ భవన్ గేట్ నంబర్ 4 వద్ద ముస్లిం మహిళలు శాంతియుత నిరసన చేపట్టి నినాదాలు చేశారు. చాలా ప్రాంతాల్లో ఈ నిరసన విస్తరించింది.

హిందూ సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేయడం, పోలీసులు కేసులు నమోదు చేయడం - ఇలాంటి ఎన్నో వార్తలు వింటూ వస్తున్నాం.

ఫిర్యాదులు, చర్యలకు సంబంధించిన మరో విచిత్రమైన వార్త కూడా చూద్దాం.

సమాచార ప్రసార మంత్రిత్వశాఖ కొన్ని టెలివిజన్ ఛానళ్లకు నోటీసులు పంపి, హిందీ కార్యక్రమాల్లో ఉర్దూ పదాలు ఎందుకు వాడుతున్నారని నిలదీసింది. ఒక పౌరుడు గారు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ చర్య తీసుకున్నారంట. ఫిర్యాదులు చర్యల లిస్టులో ఇది మరో ఉదాహరణ. మహారాష్ట్రలోని థానేకు చెందిన శ్రీవాస్తవ అనే వ్యక్తి మంత్రిత్వశాఖకు రాసి, హిందీ ఛానళ్లు హిందీలో ప్రసారాలు చేస్తున్నామని చెప్పుకుంటూ వాడుతున్న భాషలో 30 శాతం పదాలు ఉర్దూ అని ఆరోపించాడు. ఇది మోసం, నేరం అన్నాడు. ఆయన అభ్యంతరం కరక్టే అని మంత్రిత్వశాఖ వెంటనే నిర్ణయానికి వచ్చేసింది.

ఈ పౌరుడు గారు "30 శాతం" అనే ఖచ్చితమైన లెక్క ఎలా వేశాడో మంత్రిత్వశాఖ అడగలేదు. హిందీ ప్రసారాల్లో కేవలం ఉర్దూ పదాలే కలుషితం చేస్తున్నారా? లేక ఇంగ్లీషు పదాలు కూడా కలుషితం చేస్తున్నారా? ఇంగ్లీషు పదాలు వాడితే హిందీ అందం పెరిగిపోతుంది కాబట్టి ఓ.కే. అనుకుంటున్నారా? ఒక భాషలో ఉర్దూ, ఇంగ్లీషు, అరబీ తదితర అన్యభాషా పదాలు వాడడం నేరమా?

ఉర్దూ పదాలు వాడవద్దంటూ మంత్రిత్వశాఖ ఛానళ్లకు రాసిన లేఖలో "గలత్" హిందీ వాడుతున్నారని చెప్పింది. తప్పు

హిందీ ఇస్తేమాల్ చేస్తున్నారని చెప్పింది. మంత్రిత్వశాఖ వాడిన పదాలు కూడా ఉర్దూ పదాలే. ఇంతకన్నా హాస్యాస్పదం మరొకటి ఉండదు. కాని ఇది ఫిర్యాదులు, చర్యల జాబితాలోని అంశం అని గమనించాలి. కాబట్టి హాస్యాస్పద మైనా నవ్వ రాదు.

అసలు "హిందీ" అనే పదం కూడా అచ్చమైన హిందీ పదమా? "హింద్" అనే పదం ఎక్కడి నుంచి వచ్చింది? హిందీని "పూర్తిగా శుద్ధి చేయాలి" అని అనుకుంటే, నామకరణం నుంచి మొదలెట్టాల్సిందే.

కాని ఇదంతా ఈ ఫిర్యాదుదారులకు, చర్యలు చేపట్టిన వారికి ముఖ్యం కాదు. వారికి ముఖ్యమైనది హిందీలో ఉర్దూ పదాలు వాడటం నేరం... అంతే... మీలాదున్నబీలో ఒక అభ్యంతరం ఎవరో చెప్పారు.. అంతే... కేసులు.

మరాఠీ భాష మాట్లాడే గాడ్సేకు హిందీలో ఉర్దూ కలిసి పోవడంపై కూడా కోపం వచ్చింది. హిందుస్తానీ భాషకు మద్దతు ఇవ్వడం గాంధీ చేసిన అతి పెద్ద నేరాల్లో ఒకటని గాడ్సే అన్నాడు.

హిందీ నుంచి ఉర్దూ పదాలను తొలగించే ప్రయత్నం చాలా కాలంగా జరుగుతోంది. కాని హిందీ నుంచి ఇంగ్లీషు పదాలు తొలగించే ప్రయత్నం మాత్రం కనిపించదు.

ఏది ఏమైనా ఒక పౌరుడు గారి అభ్యంతరంపై వెంటనే చర్య తీసుకుంటూ, లేఖ రాసిన మంత్రిత్వ శాఖ లేఖలోనే ఉర్దూ పదాలున్నాయని పలువురు నవ్వుకుంటున్నప్పుడు, కాస్త తెల్లమొహం వేసి తర్వాత ఒక పౌరుని ఫిర్యాదును ఛానళ్లకు ఫార్వర్డ్ చేశాం తప్ప మరే ఆదేశాలు ఇవ్వలేదని చెప్పుకుంది.

మొత్తానికి ఇదంతా "శుద్ధ హిందీ" ప్రయత్నం. దేశంలో "శుద్ధ శాకాహారం" కోసం కూడా ప్రయత్నాలు జరుగు తుండడం మనం చూస్తూనే వస్తున్నాం. అలాగే శుద్ధ సమాజం ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఆ ప్రయత్నాల్లో భాగమే మీలాదున్నబీ పోస్టరు, బ్యానర్‌పై ఫిర్యాదులు చర్యలు. అలా ఫిర్యాదు రాగానే ఇలా చర్యలు ఉంటాయి. ఇంత వేగంగా చర్యలు ఇతర విషయాల్లో ఉండవన్నది కూడా అందరికీ తెలిసిన విషయమే.

ఈ శుద్ధి ప్రయత్నాల హోరులో అసలు సమస్యలను ప్రజలు మరిచిపోతుంటారు. అసలు సమస్యలేమున్నాయని అడుగు తుంటారు. నిరుద్యోగం పెరిగిందా? ధరలు పెరుగు తున్నాయా? రోడ్లపై గుంతలు గోతులు పెరిగాయా? ఆసు పత్రుల్లో వైద్యసౌకర్యాలు పెరిగాయా? కొత్త ఆసుపత్రులు కట్టారా? పిల్లలు చదువుకునే విద్యాలయాలు పెరిగాయా? విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్ళిన వారి పరిస్థితి ఎలా ఉంది? వారి సంక్షేమానికి మనమేం చేస్తున్నాం? మునిసిపాలిటీల్లో డ్రయినేజ వ్యవస్థ పరిస్థితేంటి? ఇవన్నీ చాలా మామూలు ప్రశ్నలు. వీటిని ప్రశ్నించే తీరుబడే లేదు. ఎందుకంటే శుద్ధి మహాయజ్ఞంలో అందరూ తలమునకలై పోతున్నారు.

గజ్జెల మల్లారెడ్డి దాదాపు అర్థ శతాబ్దం క్రింద చురక పేరుతో రాసిన పంక్తులు గుర్తొస్తున్నాయి.

తెలుగునాట భక్తిరసం

తెప్పలుగా పారుతోంది

డ్రయినేజి స్కీము లేక

డేంజరుగా మారుతోంది

ఈ పంక్తుల్లో తెలుగునాట అనేది మొత్తం దేశానికి వర్తిస్తుందని చదువుకో అన్నారు నాకు మాత్రాఛందస్సులో ఓనమాలు నేర్పిన గురువుగారు.

క్లుప్తంగా చెప్పేదేమిటంటే, అంతా ఒక పద్ధతి ప్రకారం జరుగు తోంది. ఒక పౌరుడుగారు, లేదా ఒక సంస్థగారు ఫిర్యాదు చేస్తారు. పోలీసువారు లేదా మరో శాఖవారు చర్యలు తీసు కుంటారు. ఒక్కోసారి కొందరి అరెస్టులు జరుగుతాయి. విచారణ జరుగుతుంది. కొనసాగుతూ ఉంటుంది. ఏళ్ళు గడుస్తుంటాయి. బెయిళ్ళు ఇస్తే దేశానికి చాలా నష్టము, కొందరికి చాలా కష్టము. కాబట్టి జైళ్ళు ఇళ్ళయిపోతాయి. చివరకు నిర్దోషులుగా విడుదలవుతారు. ఇటీవల ఆజంఖాన్ మాదిరిగా దాదాపు రెండేళ్ళకు.

ఇంకా దీనిపై రాయడానికి ఏమీ లేదు... పాఠకులే స్వయంగా చాలా రాయగలరని భావిస్తూ ఇంతటితో ముగించేస్తున్నాను. ✤


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ

నైతిక పథకం

సహజీవన భావనల పావురాయి

గీటురాయి

వారపత్రిక




# అరబ్ నాటో: ముస్లిం దేశాల ఐక్యతారాగం?

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

**మధ్యప్రాచ్యం** మరోసారి ఉద్రిక్తతలకు కేంద్ర బిందువవుతోంది. ఇటీవల ఖతర్‌పై ఇస్రాయీల్ జరిపిన వైమానిక దాడులు కేవలం ఒక దేశాన్ని లక్ష్యంగా చేసుకున్న చిన్న సంఘటన కాదు, మొత్తం ఇస్లామిక్ ప్రపంచానికి విసిరిన సవాలుగా దానిని చూడాల్సిన అవసరం ఉంది. ఈ దాడులు హమాస్ అగ్రనాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నప్పటికీ, వాస్తవానికి ఇవి ఇస్రాయీల్‌ను వ్యతిరేకించే ముస్లిం దేశాలకు ఒక హెచ్చరిక. దాని గత చరిత్రను మనం చూసినట్లయితే, ఇస్రాయీల్ ప్రతీ దాడి వెనుక ఒక పెద్ద వ్యూహం దాగి ఉంటుంది, అది కేవలం ఒక సరిహద్దు వివాదం కాదు. ముస్లింల సమైక్యతను, సంఘీభావాన్ని పరీక్షించే, విభజించే ప్రయత్నం. ఈ నేపథ్యంలోనే "అరబ్ నాటో" అన్న పదం మరో సారి అంతర్జాతీయ చర్చల్లో బలంగా వినిపిస్తోంది.

ఇప్పటి వరకు విడివిడిగా తమ తమ రాజకీయ ప్రయోజనాలు చూసుకున్న అరబ్ దేశాలు ఇప్పుడు ఒకే వేదికపై చర్చించడానికి, ఒకే రక్షణ కవచం ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావడం శుభ పరిణామమే. దోహాలో ఇటీవల జరిగిన అత్యవసర సమావేశానికి పాకిస్తాన్, టర్కీ, ఈజిప్టుతో పాటు ముప్పైకి పైగా ఇస్లామిక్ దేశాల అధినేతలు హాజరయ్యారు. పాకిస్తాన్ తన అణ్వాయుధ శక్తి నేపథ్యంతో ఒక గట్టి స్వరాన్ని వినిపించే స్థాయి కలిగిఉంది. దాని ప్రతిపాదన ప్రకారం, ఇస్రాయీల్ దాడులను ఎదుర్కొనే ఉమ్మడి టాస్క్‌ఫోర్స్ అవసరం. టర్కీ అధ్యక్షుడు ఎర్దొగాన్ కూడా అదే ధోరణిలో మాట్లాడుతూ, కేవలం సైనికంగా మాత్రమే కాకుండా ఆర్థికంగా కూడా ఇస్రాయీల్‌ను అణగ దొక్కడమే అసలు సమాధానం అని స్పష్టం చేశారు. మరోవైపు, అరబ్ ప్రపంచంలోనే అతిపెద్ద సైన్యం కలిగిన ఈజిప్ట్ ఒకడుగు ముందుకు వేసి, దోహాలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసి, తొలి దశలో ఇరవై వేల మంది సైనికులను సమకూర్చడానికి సిద్ధమని ప్రకటించింది. ఈజిప్ట్ దృక్పథంలో, ఇది కేవలం ఒక తాత్కాలిక ప్రతిస్పందన కాకుండా, ఒక దీర్ఘకాల సమిష్టి రక్షణ వ్యవస్థగా అభివృద్ధి చెందాలి.

ఇక్కడ ఒక తాజా రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. సౌదీ అరేబియా, పాకిస్తాన్ మధ్య కుదిరిన వ్యూహాత్మక రక్షణ ఒప్పందం ప్రకారం, ఒక దేశంపై దాడి జరిగితే, అది రెండింటిపై జరిగిన దాడిగా పరిగణించబడుతుంది. ఇది ప్రధానంగా భారత భద్రతా ప్రయోజనాల దృష్ట్యా ఆందోళన కలిగించే అంశం. భారత్ ఇప్పటికే ఈ పరిణామాలను సున్నితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. పాక్‌తో సౌదీ వ్యూహాత్మక భాగస్వామ్యం పరస్పర ప్రయోజనాలు, సున్నితత్వం దృష్టిలో ఉంటుందని భారత్ ఆశిస్తోంది. ఈ ఒప్పందం మధ్యప్రాచ్య పరిస్థితులను మరింత సంక్లిష్టం చేస్తూ, 'అరబ్ నాటో' ప్రస్తావనపై కొత్త వాస్తవ రాజకీయ దృక్పథాన్ని తీసుకువచ్చింది.

గమనించదగ్గ విషయం ఏమిటంటే, 'అరబ్ నాటో' అనేది అధికారిక కూటమి పేరు కాదు. అరబ్ దేశాలన్నీ కలసి ఏర్పరచ దలిచిన సమిష్టి రక్షణ కూటమిని సూచించడానికి మీడియా, విశ్లేషకులు ఈ పదాన్ని వాడుతున్నారు.

అయితే, ఇంతకుముందు కూడా ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. అరబ్ ప్రపంచ ఐక్యత అనేది కాగితాలపై ఉన్నంత అందంగా నేలమీద కనబడడం లేదు. అసలు 1948లోనే తొలిసారి అరబ్ దేశాలు ఇస్రాయీల్‌పై సంయుక్త యుద్ధం జరిపాయి. కానీ ఐక్యత లోపం వల్ల ఆ యుద్ధం విఫలమై, ఇస్రాయీల్‌కు అనుకూలంగా మార్గం సుగమమైంది. 1973 యోమ్‌కిప్పూర్ యుద్ధంలో ఈజిప్ట్, సిరియా కలసి ఇస్రాయీల్‌పై దాడి జరిపినప్పుడు, ప్రారంభంలో విజయాలు సాధించినప్పటికీ, అమెరికా జోక్యం, పాశ్చాత్య మద్దతు కారణంగా ఇస్రాయీల్ తిరిగి పైచేయి సాధించింది. ఆ యుద్ధం ముస్లిముల ఐక్యతకు ఒక ఉదాహరణగా నిలిచినా, అది కొనసాగలేకపోయింది. 1991 గల్ఫ్ యుద్ధంలో మరింతగా అంతర్గత విభేదాలు బయట పడ్డాయి. ఇరాక్ కువైట్‌పై దాడి చేసినప్పుడు, కొన్ని అరబ్ దేశాలు అమెరికా శిబిరంలో చేరగా, మరికొన్ని విభిన్న వైఖరులు అవలంబించాయి. ఫలితంగా, ఇస్లామిక్ ప్రపంచం లోపల్లోపలే అంతర్గతంగా పరస్పర అవిశ్వాసం పెరిగింది. ఇదే కారణంగా 1945లో ఏర్పడిన అరబ్ లీగ్ ఎన్నోసార్లు బహిరంగ ప్రకటనలు చేసినా, వాస్తవ కార్యాచరణలో విఫలమైంది. ఈ చరిత్ర మళ్లీ ఇప్పుడు మన ముందున్నది.

ఈనాటి పరిస్థితి కూడా దానికి భిన్నంగా ఏమీలేదు. అనేక అరబ్ దేశాలకు ఇస్రాయీల్‌తో ఇప్పటికే సౌమ్య సంబంధాలు ఉన్నాయి. యుఏఈ, బహ్రెయిన్ వంటి దేశాలు ఇటీవల శాంతి ఒప్పందాల ద్వారా ఇస్రాయీల్‌తో ఆర్థిక, వాణిజ్య సంబంధాలను విస్తరించాయి. వీటిని ఒక సమిష్టి సైనిక కూటమిలో చేర్చడం ఎంతవరకు సాధ్యం అనేది సందేహమే. మరోవైపు, ఈరాన్ మాత్రం ఈ కూటమికి పూర్తిగా ఇస్లామిక్ స్వరూపం ఇవ్వాలని చూస్తోంది. కానీ కొన్ని అరబ్ దేశాలు ఈరాన్ ప్రభావాన్ని అనుమానంతో చూస్తున్నాయి. అందువల్ల, 'అరబ్ నాటో' ప్రతిపాదన అనేది ముస్లిం ప్రపంచాన్ని ఏకం చేస్తుందా? లేక మరిన్ని అంతర్గత విభేదాలకు, విభజనలకు దారితీస్తుందా? అనే ప్రశ్న చర్చనీయాంశంగానే ఉంది.

ఇక్కడ అన్నిటికంటే పెద్ద సమస్య అమెరికా పాత్ర. మధ్య ప్రాచ్యంలో ప్రతి కదలికపై అమెరికా ఓ కన్నేసి ఉంచుతుంది. సౌదీ అరేబియా, ఖతర్ వంటి దేశాలు అమెరికాకు వ్యూహపర మైన మిత్రదేశాలు. అవి పాశ్చాత్య ఒత్తిడిని పూర్తిగా నిర్లక్ష్యం చేయలేవు. మరోవైపు, అమెరికా ఇస్రాయీల్‌కు ఎప్పటిలాగే వెన్నుదన్నుగా బలంగా నిలుస్తుంది. అటువంటి పరిస్థితిలో అరబ్ దేశాలు సమిష్టి సైనిక కూటమి నిర్మించాలంటే, అది కేవలం ఇస్రాయీల్‌తో పోరాటం మాత్రమే కాదు, పాశ్చాత్య ఆధిపత్యానికి కూడా సవాలు అవుతుంది. ఇది నిజంగానే పెద్ద ఛాలెంజ్.

అయినా, ఈ సందర్భం ముస్లిం దేశాల సమైక్యతకు, సంఘీ భావానికి ఒక పరీక్ష. ఖతర్‌పై జరిగిన దాడి కేవలం ఖతర్‌కే సంబంధించినది కాదు, అది మొత్తం ఇస్లామిక్ ప్రపంచ గౌరవానికే అవమానం. ఈ రోజు ఒక దేశం లక్ష్యమైతే, రేపు మరొక దేశం కావచ్చు. ఇస్రాయీల్ వ్యూహం అన్ని వేళలా ముస్లిముల ఐక్యతను చీల్చే దిశగా సాగుతూనే ఉంది. దీనికి బలమైన సమిష్టి ప్రతిస్పందన లేకపోతే, ప్రతి దేశం విడివిడిగా బలహీనపడుతూ శత్రువు ముందు నిలబడలేని స్థితికి చేరుతుంది.

అందుకే 'అరబ్ నాటో' ఆలోచనకు ఈసారి చరిత్రాత్మక ప్రాధాన్యం ఉంది. ఇది కేవలం ఒక ఆర్భాటపు రాజకీయ నినాదంగా మిగిలిపోతే, ముస్లిం ప్రపంచానికి మరోసారి చేదు అనుభవమే మిగులుతుంది. కానీ నిజంగా ఆచరణలోకి వస్తే మాత్రం, ఇదొక చరిత్రాత్మక మలుపు కావచ్చు. ఇది ముస్లిముల ఐక్యతను ఊహాజనితం అని భావించే వారికి గట్టి సమాధానం అవుతుంది.

అరబ్ దేశాలు గత వైఫల్యాల నుండి గుణపాఠాలు నేర్చుకుని నిజమైన సమిష్టి రక్షణ వ్యవస్థను నిర్మించగలవా? లేక మళ్లీ ప్రకటనలకు, ప్రగల్భాలకే పరిమితమై, విభజనల బాట పడ తాయా? అన్నది రాబోయే రోజుల్లోనే తెలుస్తుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. ముస్లిం ప్రపంచం ఇప్పటికైనా ఏకమవ్వకపోతే, భవిష్యత్తు తరాలకు కూడా ఇదే దుస్థితి మిగులు తుంది. శత్రువు ప్రతి బలహీనతను వాడుకుంటూ ముందుకు సాగుతాడు. ఈ రోజు 'అరబ్ నాటో' ఆలోచన ఒక ఆశా కిరణంలా కనిపిస్తున్నప్పటికీ, దాని విజయమైనా, వైఫల్యమైనా ముస్లిం దేశాల ఐక్యతపైనే ఆధారపడి ఉంటుంది. ✤



9/2

# సత్య పిపాసకు మారుపేరు

ఎస్.ఎమ్. మలిక్

# మహనీయ సయీద్ బిన్ జైద్ (రజి)

## మదీనా జీవితం

ప్రవక్త మస్జిద్ నిర్మాణం తరువాత ప్రవక్త(స) ఒక్కొక్క ముహాజిర్‌ని ఒక్కొక్క అన్సారీతో సోదరత్వం ఏర్పరిచారు. మహనీయ సయీద్ సోదరత్వం మహనీయ రాఫె బిన్ మాలిక్ అన్సారీతో చేశారు. ప్రవక్త(స) హిజ్రత్ తరువాత పూర్వం యస్రిబ్ అనే నగరమే మదీనతున్నబీ లేదా మదీనా అని పిలువబడేది. అనేక వందల మంది మదీనా వాసులు ముస్లిములయి ఇస్లామ్ కొరకు ప్రాణాలర్పించే సిపాయిలయిపోయారు. మక్కా నుండి హిజ్రత్ చేసి చాలా మంది ముస్లిములు మదీనా చేరిపోయారు. ఈ విధంగా ఈ ప్రాంతం ఏకేశ్వరోపాసనకు, ఇస్లామీయ ఉద్యమానికి ఓ పటిష్టమయిన కేంద్రంగా రూపొందింది.

### గిల్లి కజ్జాలు

మక్కా తిరస్కారులు ఈ కేంద్రాన్ని ఏ విధంగా భరించ గలరు? వారు అనేక విధాలుగా బెదిరింపులతో, కుతంత్రాలతో, బల ప్రదర్శనలతో ఈ కేంద్రాన్ని విచ్ఛిన్నం చేయాలని యత్నించారు, కాని వారు అనుకున్నట్లు అది సాలెగూడు కాదు, అది బండరాళ్ళతో నిర్మించిన కోటలకన్నా బలిష్టమయినదిగా తేలింది. ఇక ఎటూ పాలుపోక మక్కా పవిత్ర నగరంలో ముస్లిముల ప్రవేశం నిషేధించారు. దానికి బదులుగా మదీనా వాసులు వారి కొరకు సిరియా మార్గాన్ని ప్రమాదకరంగా రూపొందించారు. ఆ పైన బహుదైవారాధకులకు వారి వాణిజ్యం, జీవిక కష్టసాధ్యమయి పోయాయి.

ఈ పరిస్థితుల్లో హిజ్రీ 2వ సంవత్సరం ఖురైష్‌కు చెందిన ఓ పెద్ద వాణిజ్య బిడారు సిరియా నుంచి తిరిగి వస్తున్న సమాచారం అందింది. ఈ బిడారు మదీనా పరిసరాల నుంచే పోవలసి ఉంటుంది. అదొక్కటే ఇరాక్, సిరియాల దారి. ప్రవక్త మహనీయులు(స) ఇద్దరు సమర్థులయిన వ్యక్తుల్ని సిరియా పయనానికి ఎన్నుకున్నారు. వారిలో ఒకరు మహనీయ సయీద్ బిన్ జైద్, మరొకరు తల్హా బిన్ ఉబైదుల్లాహ్.

వారిరువురూ సిరియాలో ఎంతో చాతుర్యంతో ఆ బిడారు లోని వ్యక్తుల పేర్లు, వారి సంఖ్య తెలుసుకున్నారు. ఇంకా వాణిజ్య సరకులు వాటి విలువ కూడా తెలుసుకున్నారు. వారిరువురు ప్రవక్తశ్రీ(స)కి నివేదిక ఇవ్వడానికి మదీనాకు బయలుదేరారు.

## తొలి పోరాటం

బిడారులో కొందరికి అనుమానం కలిగింది, వారిద్దరు తమ సమాచారం సేకరించడానికి రాలేదు కదా అని. వారు తమ అనుమానం బిడారు నాయకుడు అబూ సుఫ్యాన్ కు తెలిపారు. అందువల్ల ఆ బిడారు ఎంతో జాగరూకత కనబరచి, మదీనా కు దూర దూరంగా ఎర్ర సముద్రం తీరాన, పయనించి మక్కా చేరాలని అనుకున్నారు. అంతేకాదు, బిడారు నాయకుడు ముందస్తుగా మక్కా నాయకులకు కబురు పంపారు, తమ బిడారుకు రక్షణార్థం కొంత బలగం పంపమని.

మక్కా వాసులు, మదీనా వాసులను బిడారు వైపునకు కన్నెత్తి చూడనివ్వకుండా అంతమొందించాలని పన్నాగం పన్నారు, బద్ర్ అనే చోట మకాం వేశారు. ఈ విషయాలు తమ గస్తీ దళాల ద్వారా గ్రహించి ప్రవక్త మహనీయులు (స) బద్ర్‌లో మక్కా వాసుల్ని ఎదుర్కొన్నారు. అదొక పోరాటంగా మారింది. ఆ పోరాటంలో ముస్లిములకు దైవం అసాధారణ విజయాన్ని అనుగ్రహించాడు. పైగా యుద్ధ ప్రాప్తి ద్వారా కూడా ముస్లిము లకు ప్రయోజనం చేకూర్చాడు.

## ఖిలాఫత్ కాలంలో

మహనీయ అబూ బక్ర్ (ర) హిజ్రీ 12వ సంవత్సరం చివరన నలుగురు సైనిక దళాధిపతుల్ని సిరియా, జోర్డాన్ వైపునకు పంపారు. అందులో మహనీయ సయీద్(ర) మహనీయ అబూ ఉబైదా బిన్ జర్రాహ్ కూడా ఉన్నారు. హిజ్రీ 13వ ఏట యర్మూక్ పోరులో మహనీయ సయీద్ బిన్ జైద్ నిర్వహిం చిన పాత్ర పేర్కొనదగ్గది. అది ఆయన నోట వినాలి:

“యర్మూక్ పోరాటంలో మా సంఖ్య దాదాపు ఇరువై నాలుగు వేలు, మరి రోమను సేన ఒక లక్ష ఇరువై వేలు. దాన్ని చూస్తే ఓ కొండ కదలి వస్తున్న భ్రమ కలిగేది. ముస్లిములు వారిని ఈ స్థితిలో చూసి తొలుత భీతిల్లి పోయారు. అప్పుడు సేనాధి పతి మహనీయ అబూ ఉబైదా బిన్ జర్రాహ్(ర) నిలబడి ప్రసంగించారు :

దేవుని దాసులారా! దైవానికి సహాయం చేయండి, దైవం మీకు సహాయపడతాడు, మిమ్మల్ని స్థిర పరుస్తాడు. దేవుని దాసులారా! దైవ మార్గంలో స్థిరంగా నిలవండి, సహనం వహించండి, సహనం నిశ్చయంగా తిరస్కారం నుంచి ముక్తికి, దైవ ప్రసన్నతకు, నైచ్యం ను పారద్రోలేందుకు రాచమార్గం! మీ బల్లాలను గురి పెట్టండి, మీ డాలును అడ్డుగా పెట్టండి, నేను దాడి చేసే సంజ్ఞ చేయనంత వరకు మౌనం వహించండి, అంతర్యంలో అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండండి.”

## ప్రాణార్పణ

మహనీయ సయీద్(ర) ఇంకా ఇలా అన్నారు, “ఆ క్షణం లోనే ముస్లిముల పంక్తుల నుండి ఓ సైనికుడు ముందుకు వచ్చి అబూ ఉబైదాతో అన్నాడు, ‘నేను ఇప్పుడే దైవ మార్గంలో ప్రాణార్పణకు నిర్ణయం తీసుకున్నాను. మీరు దైవ సందేశ హరులకు ఏమయినా సందేశం పంపదలిస్తే చెప్పండి’ అని. దానికి ఆయన, “దైవ సందేశహరులకు మా అందరి తరుపున సలాములు అందజేసిన తరువాత చెప్పివెయ్యి, దైవ ప్రవక్తా! ప్రభువు అల్లాహ్ మాతో చేసిన వాగ్దానాలన్నీ ఒక్కొక్కటే పూర్తి అయ్యాయి. అని”.

ఆ పైన మహనీయ సయీద్ అన్నారు, “నేను ఆ సైనికుని మాటలు వినగానే అతను ఒరలోనుంచి కరవాలం తీసి శత్రు వుల వైపునకు పోతూ కనిపించాడు. నేను కూడా నా బల్లేన్ని గురి పెట్టి పోరుకు సిద్ధమయ్యాను. శత్రు దళం నుంచి మొదటి సైనికుడు మా వైపునకు లంఘించగానే అతన్ని బల్లేనికి గుచ్చేసి శత్రువుల పైకి లంఘించాను. అప్పుడు దైవం నా అంతర్యంలో నుంచి భయాందోళనలు పూర్తిగా దూరం చేసి వేశాడు. ఇక ముస్లిములంతా రోమనులపై ఒక్కసారిగా విరుచుకు పడ్డారు. ఇక దైవం తన సహాయం, విజయం అనుగ్రహించేంత వరకు పోరాడారు” అని.

లక్షలాది సంఖ్యలో రోమను సేనను ఎదుర్కొన వలసి వచ్చి నప్పుడు అందులో ఆయన ఒక సైనిక విభాగానికి దళపతిగా పాల్గొన్నారు. ఈ చారిత్రక పోరాటంలో సిపాయిలతో కలిసి ఆయన శౌర్యం, ధీరత్వం ప్రదర్శించడంలో రికార్డు సృష్టిం చారు. ఆశ్చర్యకరంగా కేవలం యుద్ధం జయించడం మాత్రమే కాదు, ముస్లిముల ఈ విజయం పట్ల ఆనాటి

ప్రపంచం విస్తుపోయింది. క్రైస్తవుల శక్తి పటాపంచలయింది, వారి చక్రవర్తి సిరియా వదలి పారిపోయాడు.

## అసంతృప్తి

మహనీయ ఉమర్(ర) ఖిలాఫత్ కాలంలో డెమాస్కస్‌ని చుట్టుముట్టిన సేనలో మహనీయ సయీద్ కూడా ఉన్నారు. విజయ దినాన కోటగోడను దాటిన వారిలోనూ ఆయన ఉన్నారు. ఆ పైన సంధి ఒప్పందం జరిగిన తరువాత మహనీయ అబూ ఉబైదా ఆయన్ని డెమాస్కస్ గవర్నర్ గా నియమించారు. అయితే ఆయన సతత సమర అభిలాష తృప్తి చెందలేదు. ఆ నాటి పశ్చిమ ప్రాంతాల కమాండర్ ఇన్ చీఫ్, మహనీయ అబూ ఉబైదా బిన్ జర్రాహ్ కు వ్రాశారు,

"గౌరవనీయులు నాయక మాన్యులకు, శుభ శ్రేయాల ఆశీస్సులతో విన్నపం, నేను మీ ఆదేశ పాలనకు, త్యాగానికి నా ఆంతర్యాన్ని ఒప్పించలేక పోతున్నాను. జనులు ధర్మ రక్షణకు, ధర్మ సంస్థాపనకు తమ ప్రాణాలొడ్డి సమర మైదానంలో రక్తం చిందిస్తూ ఉంటే నేను ఆ రంగాన స్వయం సమర్పణకు నోచుకోక పోవడం శోచనీయం. ఈ లేఖ అందగానే నా స్థానాన మరెవరినయినా పంపించండి. నేను ఇక్కడి నుంచి సెలవు తీసుకుని మీ వద్దకు, యుద్ధ భూమికి చేరాలని ఉంది."

మహనీయ అబూ ఉబైదాకు ఈ లేఖ అందగానే యంత్రాంగంలో మార్పులు చేసి మహనీయ ముఆవియ(ర) సోదరుడు యజీద్ బిన్ అబీ సుఫ్యాన్‌ని డెమాస్కస్ గవర్నర్‌గా నియమించారు. ఇక సయీద్ బిన్ జైద్(ర) యుద్ధ భూమికి వెళ్ళిపోయారు.

## ప్రశాంతత

మహనీయ ఉమర్ ఫారూక్(ర) ఖిలాఫత్ కాలం తరువాత మహనీయ సయీద్(ర) జీవితంలో ఓ విధమయిన ప్రశాంతత, స్థయిర్యం నెలకొన్నది. మహనీయ ఉస్మాన్(ర) ఖిలాఫత్ చివరి కాలంలో సబాయీల వల్లనూ, ఇస్లామ్‌లో కొత్తగా ప్రవేశించిన వారి అపరిపక్వత వల్లనూ చెలరేగిన గలభాల కారణంగా చింతాగ్రస్తులయ్యారు. కడకు ప్రవక్తశ్రీ(స) భవిష్యవాణి ప్రకారం, మహనీయ ఉస్మాన్(ర) అమరగతులయినప్పుడు ఆయన ఆందోళన దుఃఖాలకు హద్దుల్లేకపోయింది. ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ పలికిన మాటలు హదీసు గ్రంథాలు ఉటంకించాయి,

మీరు మహనీయ ఉస్మాన్(ర) పైన చేసిన దౌర్జన్యాల కారణంగా ఉహుద్ కొండ చీలి పోయినా తక్కువే. (బుఖారీ)

❖ ❖ ❖


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు Screen Shot పంపి 9989903850 ఫోన్ చేయండి.

**Bank Details**

Geeturai Weekly
Account No:1042789768
Bank: Central Bank of India
Noorkhan Bazar Branch,
IFSC Code. CBIN0282407
Hyderabad- 500 002, Telangana

Office Address: Geeturai Weekly
Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar
Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com

మానసిక వికాసం

మంగళగిరి జీలాని



# ఫోన్ సమయాన్ని తగ్గించుకోవటం

**నేడు** ఫోన్ ప్రాథమిక అవసరంగా మారిపోయింది. ఫోన్ లేకుండా క్షణం కూడా గడవని పరిస్థితి. ఈ రోజుల్లో సెల్‌ఫోన్‌కున్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. వీటి కోసం మనం ఎంతో సమయాన్ని ఖర్చు చేస్తాం. ఇందులో కొంత సద్వినియోగమైతే కొంత (చాలా అనవచ్చు) వృథా అవుతుంది. ఇలా సమయం వృథా కాకూడదనుకుంటే కొన్ని అలవాట్లు చేసుకోవచ్చు. అవేమిటో చూద్దాం.

1) ఏం మాట్లాడాలో ఫోన్ చెయ్యకముందే నిర్ణయించుకోండి. ముఖ్యమైన మెసేజీలు చూడటం కోసం రోజులో ఒక అర గంట సమయం ఉదయం/ సాయంత్రం కేటాయించుకోండి. ప్రణాళికాబద్ధంగా చేయడం వల్ల ఏ విషయమూ మర్చిపోకుండా సత్ఫలితాలు కూడా పొందవచ్చు.

2) ఇతరులకు అనుకూలమైన సమయంలో వారికి ఫోన్ చెయ్యండి. మీకు అనుకూలమైన సమయం ఏదో వారికి చెప్పండి. దీనివల్ల ఎవరి సమయం కూడా వృథా కాదు.

3) ఎవరికైనా ఫోన్ చేసినప్పుడు, వారు హలో అనగానే మీరెవరో, ఏ పని మీద చేస్తున్నారో చెప్పండి. ఇలా చేయడం వల్ల సమయం వృథా కాకుండా ఉంటుంది.

4) చాలా సందర్భాల్లో కుశల ప్రశ్నలు అనవసరం అనిపిస్తాయి. అలాంటి సందర్భాల్లో మీకు కావలసిన పనేమిటో తిన్నగా చెప్పేస్తే సమయం ఆదా అవుతుంది.

5) సాధారణ సందేశాలు, వాట్సప్ సందేశాలు (మెసేజ్‌లు) చేసి ప్రతిస్పందననను ఆశించకండి. ఎందుకంటే చాలామంది వీటిని అస్సలు పట్టించుకోరు. తప్పనిసరిగా సందేశం పంపదలిస్తే పనేమిటో పూర్తిగా చెప్పండి. స్పందించమని చెప్పండి.

6) ఫోన్‌లో వ్యక్తి దొరక్కపోతే వాట్సప్, ఫేస్‌బుక్ లేదా ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందివ్వచ్చేమో పరిశీలించండి.

7) ఫోన్ వ్యసనంగా మారిందా? లేదా? తెలుసుకోండి. బాగా ఫోన్‌కి అలవాటు పడినట్లయితే ఉదయం లేదా సాయంత్రం ఒక గంట మాత్రమే ఉపయోగించేటట్లు మీ కాలపట్టికలో రాసుకోండి. ఖచ్చితంగా సమయ పాలన చేయండి.

8) రాత్రిపూట నిద్రపోవటానికి కనీసం ఒక గంట ముందు నుండే ఫోన్ చూడకూడదని నిర్ణయించుకోండి. రెడియేషన్ వల్ల నిద్రలేమి వచ్చే అవకాశం/ ప్రమాదం ఉంది.

పైన తెలిపిన పద్ధతులను పాటిస్తే మీరు ఫోన్‌ను వినియోగించే సమయం తగ్గుతుంది అనవచ్చు. ఆ సమయాన్ని మంచి అంశాలకు వినియోగించవచ్చు. ఆలోచించండి!




**మనిషి** జీవితాన్ని తీర్చిదిద్దేది బాహ్య రూపం కాదు, హృదయం. హృదయం ఎలా ఉందో, మనిషి జీవితం కూడా అలానే ఉంటుంది. ఖుర్ఆన్, హదీస్ రెండూ హృదయం ప్రాముఖ్యతను పదేపదే గుర్తు చేస్తున్నాయి.

ముహమ్మద్ ప్రవక్త (సఅసం) ఒక అద్భుతమైన ఉపమానం ఇచ్చారు:

“శరీరంలో ఒక మాంసపు ముద్ద ఉంది. అది మంచిగా ఉంటే మొత్తం శరీరం మంచిగా ఉంటుంది. అది చెడిపోతే మొత్తం శరీరం చెడిపోతుంది. అదే హృదయం.”

ఈ మాటలలోనే మానవజీవితం యొక్క అసలు రహస్యం దాగి ఉంది.

### కఠినమైన హృదయం- రాయి కన్నా గట్టిది

**ఖుర్ఆన్ చెబుతుంది:**

**“మీ హృదయాలు కఠినమైపోయాయి- పాషాణాల మాదిరిగా, కాదు వాటికంటే కూడా కఠినమైపోయాయి. ఎందుకంటే రాళ్ళల్లో కొన్నింటినుండి సెలయేళ్ళు ప్రవహిస్తాయి. కొన్ని పగలగా వాటి నుండి నీరు చిమ్ముతుంది. మరికొన్ని అల్లాహ్‌కు భయపడి కంపించి నేలకొరుగుతాయి.” (సూరా బఖరా 2:74)**

చూడండి, రాళ్లలో కూడా మృదుత్వం ఉంటుంది. వాటి నుండి నీరు పొంగుతుంది, అవి అల్లాహ్ భయంతో కంపిస్తాయి. కానీ కొన్ని హృదయాలు అంతకంటే గట్టివి అవుతాయి. నిజజ్ఞానం, కరుణ, దయ, ధర్మం- ఏదీ వాటిని తాకదు. ఇది మనిషి ఎదుర్కొనే గొప్ప ప్రమాదం.

### కోరికల బందీ అయిన హృదయం

ఇంకో వాక్యం చెబుతోంది: “తన మనోవాంఛలను తన దేవుడుగా చేసుకున్న వ్యక్తి స్థితిని గురించి కూడా నీవు ఎప్పుడైనా ఆలోచించావా? జ్ఞానం ఉన్నప్పటికీ, అతనిని అల్లాహ్ మార్గభ్రష్టత్వంలోకి విసిరి వేశాడు, అతని హృదయం మీదా, చెవుల మీదా ముద్ర వేశాడు. అతని కళ్ళకు తెరవేశాడు. ఇక అల్లాహ్ తప్ప అతనికి మార్గం చూపే వాడెవడున్నాడు? మీరు గుణపాఠాన్ని నేర్చుకోరా?”

(సూరా జాసియా 45:23)

ఈ వాక్యం మనిషి కోరికలకు బానిసగా మారే స్థితిని వివరిస్తోంది. ఉదాహరణకు, ఎవరో డబ్బు సంపాదించడమే జీవిత లక్ష్యమని అనుకుంటారు. ఇంకొందరు భోగభాగ్యాలు, పదవులు, కీర్తి కోసం పరితపిస్తారు. ఈ కోరికలే వారి దేవుడిగా మారతాయి. అలాంటి హృదయాన్ని అల్లాహ్ సత్యం వినకుండా, చూడకుండా మూసివేస్తాడు.

### అహంకారంతో మూసుకుపోయిన హృదయం

ఖుర్ఆన్ చెబుతుంది: “అల్లాహ్, దురహంకారీ, నిరంకుశుడూ అయిన ప్రతి వ్యక్తి హృదయానికి ముద్రవేస్తాడు..”

(సూరా ఘాఫిర్ 40:35)

మన చుట్టూ ఇలాంటి వారిని చూడవచ్చు. ఆధారాలు లేకుండా వాదిస్తారు, తమ అహంకారం కోసం సత్యాన్ని తిరస్కరిస్తారు. చివరికి వారి హృదయం సత్యాన్ని స్వీకరించలేని స్థితిలో పడిపోతుంది.

## హృదయానికి శాంతి ఇచ్చే మార్గం

ఖుర్ఆన్ మరో వాక్యం మన హృదయాలకు శాంతిని ఇస్తుంది: ''వారి హృదయాలకు అల్లాహ్ సంస్మరణం వల్ల తృప్తి కలుగుతుంది. తెలుసుకోండి! అల్లాహ్ సంస్మరణ ద్వారానే హృదయాలకు తృప్తిని పొందే భాగ్యం లభిస్తుంది..'' (సూరా రా'ద్ 13:28) ఇది నిజమైన ఆధ్యాత్మిక సత్యం. మనిషి జీవితంలో అనేక ఇబ్బందులు, బాధలు ఉంటాయి. ధనం, పదవి, బంధువులు- ఏదీ శాశ్వత శాంతి ఇవ్వలేవు. కానీ అల్లాహ్ సంస్మరణలో (జ్ఞాపకంలో) ఉండే విశ్వాసమే మనసుకు అసలైన ప్రశాంతతను ఇస్తుంది. ఉదయం- సాయంత్రం చేసే దుఆలు, నమాజ్ తర్వాత చేసే జిక్ర్, ఖుర్ఆన్ పఠనం- ఇవన్నీ హృదయానికి ఔషధాలు.

## స్థిరత్వం కోసం దుఆ

మన హృదయం ఎల్లప్పుడూ మారుతూ ఉంటుంది. ఒకసారి మంచితనం వైపు మొగ్గుతే, మరోసారి బలహీనతల వైపు లాగుతుంది. అందుకే ఖుర్ఆన్‌లోని ఒక అద్భుతమైన దుఆ విశ్వాసులకు బోధించబడింది:

''ప్రభూ! నీవు మాకు సరియైన మార్గాన్ని చూపావు. ఇక మా మనస్సులను వక్రమార్గం వైపునకు మళ్ళించకు. నీ కారుణ్య నిధి నుండి మాకు కారుణ్యాన్ని ప్రసాదించు..'' (ఆల్ ఇమ్రాన్ 3:8)

ఇది ప్రతి విశ్వాసి రోజూ చేసే దుఆ కావాలి. ఎందుకంటే దీర్ఘకాలిక స్థిరత్వమే విశ్వాసాన్ని బలపరుస్తుంది.

## మన కాలానికి పాఠం

ఈ రోజు మనం చూడగలిగే సమాజంలో- డబ్బు కోసం మానవత్వాన్ని మరిచిపోయే హృదయాలు, అధికార దాహంతో అహంకారానికి బానిసైన హృదయాలు, భోగాల వెంబడి పరిగెత్తి పతనమైన హృదయాలు- వీటిని స్పష్టంగా చూడవచ్చు.

ఇవన్నీ మనకు హెచ్చరికలు. హృదయం దారి తప్పితే, జీవితమే చీకటిలో మునిగిపోతుంది. కానీ హృదయం అల్లాహ్ జ్ఞాపకంలో నిలకడగా ఉంటే, సమాజం కూడా వెలుగుతో నిండుతుంది.

హృదయ శాస్త్రం ఎంతో లోతైనది. ఖుర్ఆన్ మనకు నేర్పుతున్న పాఠం ఏమిటంటే- హృదయాన్ని పరిశుభ్రంగా ఉంచండి, అల్లాహ్ సంస్మరణలో నిలకడగా ఉండండి, స్థిరత్వం కోసం నిరంతరం ప్రార్థించండి.

హృదయం రక్షించబడితే జీవితం రక్షించబడుతుంది. హృదయం కలుషితం వ4ఇఙఒఇుఖఅయితే మనిషి నాశనం అవుతాడు. కాబట్టి ప్రతి విశ్వాసి తన హృదయం మీదే కాపలా కాస్తూ ఉండాలి. అదే నిజమైన విజయానికి సోపానం.

# గాజా : మానవీయ ఆర్తనాదం

గాజా నగర వీధుల్లో ప్రతి బాంబు, ప్రతి పేలుడు కేవలం భవనాలను మాత్రమే కూల్చడం లేదు, మానవ జ్ఞాపకాలను, జీవితాల ఆశలను కూడా నాశనం చేస్తోంది. గత నెల ఇస్రాయీల్ ప్రకటించిన "పూర్తిగా గాజా నగరాన్ని ఆక్రమిస్తాం" అనే నిర్ణయం ఇప్పుడు లక్షలాది నిరపరాధుల జీవితాలను అల్లకల్లోలం చేస్తోంది.

తమ ఇంట్లో గడిపిన ప్రతి క్షణం, గోడలపై వేలాడుతున్న జ్ఞాపకాల ఫోటోలు, చిన్న పిల్లల బొమ్మలు ఇవన్నీ ఒక్క క్షణంలో ధూళిలో కలుస్తున్నాయి. దీమా అబుఐతా అనే మహిళ చెబుతున్న మాటలు మన హృదయాన్ని కదిలిస్తాయి: "నేను నా ఇంటిని వదిలి కొద్దిగా సామాను మాత్రమే తీసుకొచ్చాను. మరిన్ని తీసుకెళ్లలేకపోయాను. బతికేందుకు కావలసిన దాన్ని ఎంచుకోవాలా, లేక జ్ఞాపకంగా ఉంచుకోవాలనుకున్నదాన్ని ఎంచుకోవాలా అన్నది నా ముందున్న ప్రశ్న."

ఇది ఒక్క దీమా కథ మాత్రమే కాదు. ఇది లక్షలాది గాజా ప్రజల సత్యం. ఎవరైనా తమ తల్లిదండ్రుల ఇల్లు విడిచి వెళ్లడం అంటే కేవలం గోడల్ని, పైకప్పును విడిచిపెట్టడం కాదు, అది తన శిశు వయసు, తన సంస్కృతి, తన కలల్ని వదలడం కూడా.

గాజా ప్రజల మనసులో 1948 నక్బా గాయం ఇంకా మానలేదు. ఒకప్పుడు తమ ఇళ్లనుంచి శాశ్వతంగా బహిష్కరించబడ్డ వంశస్థుల జ్ఞాపకాలు ఇప్పుడు మళ్లీ సజీవమవుతున్నాయి. ఈ యుద్ధం గాజా ప్రజలకు ఒకే ఎంపికను ఇస్తోంది. "వెళ్ళిపో లేక చనిపో". ఇది మానవీయ విలువలపై వేసిన బలమైన గీత. ఒక శిశువు పాలు కోసం ఏడుస్తున్నప్పుడు, ఒక వృద్ధుడు తన మందులు దొరకక విలవిల్లాడుతున్నప్పుడు, ఒక తల్లి తన పిల్లల పాఠశాల జ్ఞాపకాలు రక్తపు మరకల్లో మునిగిపోతున్నప్పుడు మనం మౌనం వహించడం మనుషులమని చెప్పుకోవడానికి తగదు. మానవీయ కోణంలో చూడాలి అంటే, గాజా యుద్ధం కేవలం భూభాగం కోసం పోరాటం కాదు. ఇది జీవన హక్కు కోసం, ఇంటి హక్కు కోసం, ఒక శిశువు బాల్య హక్కు కోసం జరుగుతున్న యుద్ధం.

ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం కేవలం రాజకీయ నేతల పని కాదు. ఇది ప్రపంచ సమాజం, ప్రతి మనిషి మానవత్వానికి పరీక్ష.



# అఫ్జల్ భాయ్‌కి ఆత్మీయ నివాళి

- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

**జీవన** ప్రయాణంలో ఎందరో వ్యక్తులు మనకు తారస పడుతూ ఉంటారు. అందులో కొందరు మాత్రమే జీవితాంతం గుర్తుండి పోతారు. అలాంటి వారిలో వరంగల్‌కు చెందిన ముహమ్మద్ అఫ్జల్ భాయ్ ఒకరు. స్నేహశీలి, మృదుభాషి, ఎప్పుడు కలిసినా అనంతమైన ఆత్మీయతను కురిపించే గొప్ప మనసున్న మంచి మనిషి. అలాంటి గొప్ప వ్యక్తిత్వం కలిగిన అఫ్జల్ భాయ్ తన మధుర స్మృతులను మిగిల్చి అనంత లోకాలకు పయన మయ్యారు. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ సెప్టెంబర్ 21వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఇహలోకం వీడి వెళ్ళిపోయారు.

### గొప్ప వ్యక్తిత్వం- సమాజ సేవ

అయన స్వభావం ఎంతో స్నేహపూర్వకమైనది. అందరితో కలుపుగోలుగా మాట్లాడడం, చిరునవ్వుతో పరిచయాన్ని స్నేహ బంధంగా మార్చేయడం ఆయనకు మాత్రమే తెలిసిన సూత్రం. మాటల్లో మాధుర్యం, వాక్కులో గంభీరత, భావప్రకటనలో ఆత్మీయత కలిసి వుండేవి. అందుకే ఆయన ఒక గొప్ప వక్తగా, ఒక ప్రేరణాత్మక స్నేహితునిగా అనేక మందిని ఆకట్టుకున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాలతోనూ ఆయనకు అనుబంధం ఉంది. ఉభయ రాష్ట్రాల పలు వేదికలపై ఆయన వాణి ప్రతిధ్వనించింది. తేటతెలుగు తియ్యదనంతో, మధురమైన స్వరంతో, ఆత్మీయత, ప్రేమ నిండిన ఆయన ప్రసంగం శ్రోతల హృదయాన్ని వెంటనే ఆకర్షించేది. ఏ సభలో ప్రసంగించినా, గంభీరత, భావ వ్యక్తీకరణ, ఆత్మీయత.. ఇవన్నీ కలసి గాఢంగా ప్రభావితం చేసేవి. ఆయన ప్రసంగం ఒక ప్రేరణ, ఒక జీవన మార్గదర్శకత, ఒక ఆత్మీయ సందేశం.

విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తూనే ఆయన సమాజసేవకు తన జీవితాన్ని అంకితం చేశారు. జమాఅతె ఇస్లామీ హింద్ సంస్థతో ఆయనకు విడదీయరాని సంబంధం ఉండేది. జమాత్ సభ్యునిగా, జిల్లా అధ్యక్షుడిగా, నాజిమె ఇలాఖాగా, జమాఅత్ రాష్ట్ర సలహా మండలి సభ్యునిగా, టి.ఐ.పి సంస్థ సానుభూతిపరు నిగా వివిధ బాధ్యతలను నిర్వహిస్తూ, తన ఆచరణతో ఒక ఆదర్శంగా నిలిచారు. ఆయన చేసిన సేవలు పదవులకు పరిమితం కాలేదు. సమాజం కోసం, ధర్మంకోసం అనుక్షణం ఆయన హృదయం తపించేది.

ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సిలర్‌గా ఆయన చేసిన కృషి అద్భుతం అంటే అతిశయోక్తి కాదు. కుటుంబాల్లో తలెత్తే విభేదాలను ఎంతో చాకచక్యంగా పరిష్కరించడం, ఎంతో మమకారంతో వారి మధ్య సయోధ్య కుదర్చడం, బాధతో, ఆవేదనతో నిండిన హృదయాలను ఓదార్చడం, కూలిపోతున్న కుటుంబాలను మళ్లీ నిలబెట్టడం ఆయన దినచర్యలో భాగంగా ఉండేది. ఎన్నో కుటుంబాలలో సంతోషకాంతులు మళ్లీ వెల్లివిరియడం వెనుక ఆయన నిశ్శబ్ద కృషి ఎంతో ఉంది.

### జ్ఞాపకాలు

ఒకసారి అబ్దుల్ జలీల్ గారి (మర్హూమ్) పరామర్శకని నేనూ,

ముర్తుజా అలీఖాన్ (రుకునె జమాత్, పాల్వంచ) వరంగల్ వెళ్ళాము. అబ్దుల్ జలీల్ గారు పాల్వంచ పట్టణ జెఐహెచ్ అధ్యక్షులుగా సుదీర్ఘకాలం సేవలందించి, అనారోగ్య కారణాల వల్ల కొడుకు డా. ముజాహిద్ ఇర్ఫాన్ వద్ద వరంగల్‌లో ఉంటు న్నారు. మాటాముచ్చట అనంతరం, ముజాహిద్ ఇంట్లోనే అల్పాహారం ముగించుకొని, అఫ్జల్ గార్ని కూడా కలుద్దామని వెళ్ళాము. మమ్మల్ని చూసిన వెంటనే ఆయన అమితమైన సంతోషంతో ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అప్పటి కప్పుడు 'వరంగల్ బిరియానీ'తో పసందైన విందు ఏర్పాటు చేశారు. అనంతరం మమ్మల్ని వెంటబెట్టుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళారు. అప్పటికే అక్కడ ఒక జంట వెయిటింగ్‌లో ఉంది. ముందుగా ఒక్కొక్కరినీ పిలిచి మాట్లాడారు. వారి సాధక బాధకా లను ఓపిగ్గా విన్నారు. సమాజంలోని సంఘటనలను ఉదాహరిస్తూ ఒక్కొక్కరికీ ఒక్కో స్టైల్‌లో నచ్చజెప్పారు. నయానా, భయానా అనునయించారు. తరువాత ఇద్దర్నీ కలిపి కౌన్సిలింగ్ చేశారు. కౌన్సిలింగ్ సమయంలో వారితో ఎంతో ఆప్యాయంగా, ఆత్మీయంగా, కన్న తండ్రిలా వ్యవహరించారు. ఆ క్రమంలో ఒక్కోసారి ఆయన కళ్ళు క్రోధంతో చింత నిప్పుల్లా మారి పోయేవి. ఒక్కోసారి ప్రేమ ధారలు వర్షించేవి. చివరికి ఆ డాక్టర్ దంపతులు అఫ్జల్ గారిపట్ల కృతజ్ఞతా భావంతో, కళ్ళనుండి ఆనంద భాష్పాలు రాలుతుండగా ఆప్యాయంగా వీడ్కోలు పలికారు. ఆ దృశ్యాన్ని మేము కళ్ళారా చూశాము.

## అసలు గౌరవం

మనిషికి అసలు గౌరవం అతని ధన సంపత్తిలో, ఆస్తి పాస్తుల్లో కాకుండా, అతను చేసే సేవలో, సద్గుణాలలో ఉందని ఇస్లాం చెబుతోంది. దైవం పవిత్ర ఖురాన్‌లో ఇలా అంటున్నాడు: '...మీలో అల్లాహ్‌కు ఎక్కువగా భయపడేవాడే అల్లాహ్ దృష్టిలో అత్యంత ఆదరణీయుడు.' (సూరె హుజురాత్: 13). ఈ దృష్టితో చూస్తే, అఫ్జల్ భాయ్ జీవితం తఖ్వాతో కూడిన జీవితమే. ఆయన మాటల్లోనూ, ఆచరణలోనూ, సమాజ సేవలోనూ అది ప్రతి ఫలించింది. ఒక విశ్వాసి జీవితానికి అసలు సౌందర్యం ఇతరులకు ఉపకారం చేయడం, ఉపశమనం కల్పించడంలోనే ఉందని ఆయన తన ఆచరణ ద్వారా నిరూపించారు. 'మానవులలో ఉత్తముడు, ఇతరులకు ఎక్కువ ప్రయోజనం చేకూర్చేవాడే'. అఫ్జల్ భాయ్ జీవితం ఈ ప్రవచనానికి అద్దం పట్టే ఉదాహరణ. తన అమూల్యమైన సలహాలు, సూచనల ద్వారా కుటుంబ కలహాలను పరిష్కరించడం, యువతకు మార్గదర్శకత చూపడం, ప్రసంగాల ద్వారా సమాజాన్ని జాగృతం చేయడం... ఈ సేవల కోసం ఒక విశ్వాసి తన సమయాన్ని, ప్రతిభను అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తే దానికి శాశ్వత ప్రతిఫలం లభిస్తుంది. ఆయన మరణం నిస్సందేహంగా లోటే అయినప్పటికీ, అదే అంతం కాదు, ఒక శాశ్వత ప్రయాణానికి ఆరంభం మాత్రమే. నిజానికి తను చేసిన ప్రతి సత్కార్యం, ప్రతి ఉపకారం ఇప్పుడు ఆయనకు సదఖతుల్ జారియాగా (ఎడతెగని పుణ్యఫలంగా) మారిపోతుంది.

వ్యక్తిగతంగానూ నాకు ఆయనతో ప్రత్యేకమైన అనుబంధం ఉంది. మా గ్రామం జగన్నాథపురంకు పలుమార్లు వచ్చారాయన. మేము కొత్తగా మస్జిద్ కట్టుకొన్నప్పుడు, మౌలానా రహ్మతుల్లాహ్ షరీఫ్ గారితో పాటు, ప్రధాన తెలుగు వక్త ఆయనే. మా కుటుంబం లోని శుభకార్యాలలోనూ ఆయన తన అమూల్యమైన సమయాన్ని కేటాయించారు. మా అమ్మాయి నికాహ్, అబ్బాయి వలీమాలో ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ గారు, ముహమ్మద్ అఫ్జల్ గారు ప్రధాన వక్తలు. మా కుటుంబ వేడుకల్లో వారి హాజరీ ఓ మరపురాని మధురానుభూతి.

ఈ రోజు ఆయన మన మధ్య లేకపోవడం ఒక పెద్ద లోటు. కానీ ఆయన చూపిన ఆత్మీయత, ఆయన నడిచిన మార్గం, ఆయన అందించిన స్ఫూర్తి, ఆయన ముఖంలోని చెదరని చిరునవ్వు ఎప్పటికీ ఒక తీపి జ్ఞాపకంగా నిలిచిపోతుంది.

అఫ్జల్ భాయ్ లేని లోటు మనసును వెంటాడుతూనే ఉంటుంది. కానీ ఆయన మాతో పంచుకున్న ఆత్మీయత, అందించిన మధుర జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా హృదయాల్లో కదలాడుతూ, స్ఫూర్తి నింపుతూనే ఉంటాయి. ఈ రోజు ఆయన వంతు, ఏదో ఒక రోజు మా వంతు. ఇన్షాఅల్లాహ్ అక్కడ కలుసుకుందాం. ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజిఊన్.

## త్వరలో...

**"గతంలోకి ఒక చూపు" శీర్షికన గీటురాయి సంపాదకులు శ్రీ ఎస్.ఎమ్.మలిక్ తన ప్రియమైన పాఠకులతో పంచుకుంటున్న అరవయ్యేళ్ళ అనుభవాలు- ఇన్షా అల్లాహ్- గీటురాయిలో ధారావాహికంగా ప్రచురించబోతున్నందుకు సంతోషిస్తున్నాము.**

**- డైరెక్టర్**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

38 ఆయత్‌లు

# 47. ముహమ్మద్

మదీనా అవతరణ

## ప్రవేశిక (గత సంచిక తరువాయి)

ఆ తరువాత ముస్లిములకు ప్రారంభ యుద్ధ నియమాలు, నిర్దేశాలు అందజేయబడ్డాయి. వారికి అల్లాహ్ సహాయం, మార్గదర్శకత్వం లభిస్తాయన్న నమ్మకం కలగజేయబడింది. వారు దైవమార్గంలో త్యాగాలు చేసినందుకు అత్యుత్తమ ప్రతిఫలం లభిస్తుందన్న ఆశ కల్పించడమూ జరిగింది. సత్య పథంలో వారి ప్రయత్నాలు వ్యర్థం కావని సంతృప్తి కలిగించడమూ జరిగింది. అంతేకాక ఇహలోకం నుండి పరలోకం వరకు వారు తమ కృషికి అతి శ్రేష్ఠమయిన ఫలాలను పొందగలరనీ నమ్మకం కలిగించబడింది.

ఆ తరువాత తిరస్కారులను గురించి, వారు అల్లాహ్ సహాయం, మార్గదర్శకత్వాలకు దూరమయ్యారని, వారు చేసే ఏ ఉపాయమూ విశ్వసించినవారికెదురుగా ఫలవంతం కాదని వారు ప్రపంచంలోనూ, పరలోకంలోనూ దుష్పరిణామాన్ని చూడబోతున్నారని తెలుపడం జరిగింది. వారు దైవప్రవక్తను మక్కా నుండి వెలికి పంపి తమకు పెద్ద విజయం ప్రాప్తమయిందని భ్రమపడ్డారు. నిజానికి ఇలా చేసి వారు తమ వినాశాన్ని స్వయంగా తామే ఆహ్వానించి మరీ పిలిపించుకున్నారని ఎత్తి చూపడం జరిగింది.

ఆ తరువాత సంబోధన కపటుల వైపునకు మరలుతుంది. వీరు యుద్ధం ఆదేశాలు రాక మునుపయితే మహా విశ్వాసులయిన ముస్లిములుగా సంచరించేవారు. కాని ఈ ఆదేశాలు రాగానే వీరికి స్పృహ తప్పినంత పనయింది. వారు తమ భవితవ్యం చింతలో తిరస్కారులతో కుట్రలు పన్నసాగారు, అలా తమ్ముతాము యుద్ధప్రమాదాల నుండి కాపాడుకోవాలని ఆలోచించుకోసాగారు. వీరికి అతి స్పష్టంగా హెచ్చరించడం జరిగింది, అల్లాహ్, ఆయన ధర్మం విషయంలో ద్వంద్వ నీతిని అవలంబించేవారి ఏ ఆచరణ కూడా అల్లాహ్ వద్ద స్వీకృతి పొందదని. ఇక్కడ ప్రాథమిక ప్రశ్నే విశ్వాస ప్రకటన చేసేవారి పరీక్షకు సంబంధించింది. మనిషి సత్యంతోపాటు ఉన్నాడా, మిధ్యతో కలసి ఉన్నాడా అన్న పరీక్ష జరుగుతోంది. అతని సానుభూతి ఇస్లామ్, ముస్లిములకు తోడయి ఉన్నాయా లేదా తిరస్కారం, తిరస్కారులకు తోడయి ఉన్నాయా? అతను తన స్వంత వ్యక్తిత్వం, స్వీయ ప్రయోజనాలను ప్రియప్రదమయినవిగా పరిగణిస్తున్నాడా లేదా తాను విశ్వసించానని వాదించే సత్యాన్నా? ఈ పరీక్షలో ఎవరు తెల్లని నాణెంగా బయటపడతారో అతను అసలు విశ్వాసియే కాడు, అతని నమాజ్, రోజాలు, అతని జకాత్ దైవం దృష్టిలో ఎటువంటి ప్రతిఫలానికయినా అర్హత పొందడం అన్నది బహుదూరపు విషయం.

ఆపైన ముస్లిములకు హితవు గరపడం జరిగింది, వారు తమ అల్పసంఖ్యను, సాధనా సామగ్రి లేమిని, తిరస్కారుల సంఖ్యాబలాన్ని, వారి సాధనాల సమృద్ధిని చూసి ధైర్యం కోల్పోరాదు. వారి సమక్షంలో సంధి ప్రతిపాదనలు పెట్టి బలహీనతను వ్యక్తం చేయరాదు, దీనివల్ల ఇస్లామ్ ముస్లిములకు ప్రతిగా వారి ధైర్యసాహసాలు మరింతగా పెచ్చరిల్లిపోతాయి. అలాకాక అల్లాహ్‌పైన భారం మోపి లేచి ఈ తిరస్కార పర్వతాన్ని ఢీకొనాలి, అల్లాహ్ ముస్లిములతోటే ఉన్నాడు, వారే ఆధిక్యత నొందుతారు. ఈ పర్వతం వారిని ఢీకొని పిండి పిండయిపోతుంది.

చివరగా ముస్లిములను దైవమార్గంలో ధనం ఖర్చు పెట్టడానికి పిలుపునివ్వడం జరిగింది. ఆ సమయాన ముస్లిముల ఆర్థికస్థితి మరీ పలచబడి ఉన్నప్పటికీ ఎదుటి సమస్య జటిలమయింది. అరబ్బు భూభాగంలో ఇస్లామ్, ముస్లిములు సజీవంగా మనగలగాలన్నది చావు బ్రతుకుల ప్రశ్నగా మారింది. ఈ సమస్య ప్రముఖమయింది, సున్నితమయింది. దీని ఆవశ్యకత కోరే దాన్నిబట్టి ముస్లిములు తమ్ము తాము, తమ ధర్మాన్నీ తిరస్కార ప్రాబల్యం ఆధిక్యతల నుండి కాపాడుకోడానికి దైవధర్మానికి ప్రాబల్యం చేకూర్చడానికి తమ ప్రాణాలనూ పణంగా పెట్టాలి, యుద్ధ సన్నాహాలకు తమ ధన ఒనరుల్ని సాధ్యమయినంత వరకు ధారపోయవలసి ఉంది. అందువల్ల ముస్లిములకు చెప్పివేయడం జరిగింది– ఈ సమయాన ఎవరయితే పిసినారితనం చూపుతాడో అతను దైవానికి కలిగించే హాని ఏమీ లేదు కాని, తన్ను తాను వినాశ ప్రమాదానికి గురి చేసుకుంటాడు. అల్లాహ్ అయితే మానవుల అగత్యం లేనివాడు, ఆయన ధర్మం కొరకు త్యాగాలు చేసేందుకు ఎవరయినా ముఖం చాటుచేసుకుంటే అల్లాహ్ ఆ వర్గాన్ని తొలగించి దాని స్థానే మరో వర్గాన్ని తీసుకువస్తాడు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ

## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం

(కితాబుత్తఫ్సీర్)

2. అల్ బఖరా

### అధ్యాయం : 7

## మేము కోరిన మా ఆయత్‌ను రద్దుపరుస్తాము లేదా మరిపింపజేస్తాము.

**332)** హజ్రత్ ఉమర్(రజి) చెప్పినట్లుగా ఇబ్నె అబ్బాస్(రజి) తెలియజేశారు: మాలో అందరికన్నా బాగా ఖుర్ఆన్‌ను పారాయణం చేసే వ్యక్తి (ఖారీ) ఉబై బిన్ కాబ్(రజి). మాలో అందరికన్నా బాగా న్యాయ నిర్ణయం గైకొనే ప్రతిభ అలీ (రజి)లో ఉంది. అయినప్పటికీ ఉబై బిన్ కాబ్(రజి) చెప్పే 'ఆ మాట'ను మేము అంగీకరించబోము. ఉబై(రజి) ఇలా అనేవారు: దైవప్రవక్త(స) పఠించగా నేను విన్న ఏ ఒక్క ఆయత్‌ను కూడా నేను వదలిపెట్టను'. మరి చూడబోతే అల్లాహ్ స్వయంగా ఇలా సెలవిచ్చాడు: "(ప్రవక్తా!) ఏదేని ఒక ఆయత్‌ను మేము రద్దు పరచినా లేక మరపింపజేసినా (దాని స్థానంలో) దానికన్నా ఉత్తమమైన దానిని లేదా కనీసం దానికి సమానమైన దానిని తీసుకువస్తాము"[1] *(2: 106)*

### అధ్యాయం : 8

**"అల్లాహ్ తన కొరకు సంతానం చేసుకున్నాడు" అనే వారి మాటకు అల్లాహ్ అతీతుడు, పరిశుద్ధుడు *(2: 116)***

**333)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహోదయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు : అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ఆదం పుత్రుడు నన్ను అబద్ధీకరించాడు. నిజానికి ఇది అతనికి ఎంతమాత్రం తగదు. అతను నన్ను దూషించాడు. వాస్తవానికి ఇది అతనికి ఏ విధంగానూ శోభించదు. అతను నన్ను అబద్ధీకరించడం అంటే అర్థం; అతను మరణించిన తరువాత మళ్ళీ నేను అతనిని బ్రతికించలేనని ఎద్దేవా చేయటం. ఇక అతను నన్ను దూషించటమంటే అర్థం; నాకు సంతానం కలదని అనటం. నేను నా కొరకు భార్యాపిల్లల్ని కలిగి ఉండటమనే దానికి నేను అతీతుణ్ని, పవిత్రుణ్ణి."[1]

332-1. మహనీయ ఉమర్ (రజి) పలుకుల్లోని ఆంతర్యం ఏమిటంటే, ఉబై బిన్ కాబ్ (రజి) ఎంత గొప్ప 'ఖారీ' అయినప్పటికీ అల్లాహ్ రద్దుపరచిన ఆయత్‌లు కొన్నింటిని ఆయన పారాయణం చేస్తున్నారు. అది మాకు ఆమోదయోగ్యం కాదు. బహుశా సదరు ఆయత్‌లు రద్దు అయిన సంగతి ఆయనకు తెలీదేమో!

ఉమర్(రజి) గారి ఈ పలుకుల ద్వారా బోధపడేదేమంటే, ఒక వ్యక్తి ఎంత గొప్ప పండితుడైనా, అతను చెప్పిన ప్రతి మాట శిరోధార్యం కానవసరం లేదు. ఎందుకంటే మరుపు లేదా పొరపాటు అనేది మానవ సహజమైన దౌర్బల్యం. ఈ బలహీనతకు దైవం, దైవప్రవక్త మాత్రమే అతీతులు.

333-1. నజ్రాన్‌కు చెందిన క్రైస్తవులు మహనీయ ఈసా (ఏసుక్రీస్తు- అలైహిస్సలామ్)ను దేవ కుమారునిగా పేర్కొనేవారు. కాగా; మక్కాలోని బహుదైవారాధకులు దైవదూతలను అల్లాహ్ కుమార్తెలుగా ఖరారు చేశారు. వారి ఈ ఉవాచను ఖండిస్తూ అల్లాహ్ పై వాక్యాన్ని అవతరింపజేశాడు. (2: 116)

# నమ్మక ద్రోహం

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ




**"విశ్వాసులారా! (వాస్తవం తెలిసి కూడా) మీరు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు ద్రోహం తలపెట్టకండి. మీకప్పగించబడే బాధ్యతల (అమానతుల, అప్పగింతలు) విషయంలో కూడా ద్రోహబుద్ధితో వ్యవహరించకండి. మీ సంతానం, సిరిసంపదలు మీ పాలిట పరీక్షా సాధనాలని గుర్తుంచుకోండి. మీ కోసం అల్లాహ్ దగ్గర ఇంతకంటే ఎంతో గొప్ప ప్రతిఫలం ఉంది".**

**(అల్-అన్ఫాల్: 27-28)**

**ఖియానత్ అర్థం :** ఇబ్న్ మన్‌జూర్ తన 'లిసాన్ అల్-అరబ్'లో ఇలా అన్నారు: "అల్-ఖవ్న్ అంటే- ఒక మనిషి మనకు ద్రోహం చేయడం. ఒకరికి మన మీద విశ్వాసాన్ని వమ్ము చేయడం, నమ్మకాన్ని నాశనం చేయడం."

ఇమామ్ కుర్తుబీ తన తఫ్సీర్‌లో అన్నారు: "ఖియానత్ అంటే ద్రోహం చేయడం, ఒక విషయాన్ని కప్పిపుచ్చడం."

ఉదాహరణకు: అల్లాహ్‌కు (మానవుల) దొంగ చూపులు, చూపుల చౌర్యం, (వారి) హృదయాల్లో దాగిన రహస్యాలు సైతం తెలుసు. అల్లాహ్ న్యాయంగా, నిష్పక్షపాతంగా తీర్పు చేస్తాడు. (అల్-మోమిన్: 19)

అలాగే ప్రవక్త ముహమ్మద్(స)ఇలా ప్రార్థించేవారు: "అల్లాహ్! నేను ఆకలి బాధ నుండి నీ శరణు కోరుతున్నాను, అది అత్యంత చెడ్డ సావాసి. అలాగే నేను ద్రోహం నుండి నీ శరణు కోరుతున్నాను, అది అత్యంత చెడు ఆత్మ బంధువు."

(నసాయి)

ద్రోహం అనేది చాలా చెడ్డ దుర్లక్షణం, అంటే మనసులో దాచుకున్న దమన నీతి. ద్రోహం, ఆకలి అనే రెండు విష యాలు ఒక వ్యక్తిని బలహీనుడిగా మారుస్తాయి. అవి కలిసి వుంటే, అవి వ్యక్తిని పూర్తిగా ఆక్రమించేస్తాయి, స్నేహితుల్లా, జతలుగా ఉంటాయి. ఒకటి మనిషిని భౌతికంగా నాశనం చేస్తే మరొకటి నైతికంగా అతన్ని నాశనం చేస్తుంది. కావున వాటి నుంచి రక్షణ కోసం ప్రార్థించాలి, ఎందుకంటే అవి మనిషి మతిని, గతిని గాడి తప్పేలా చేస్తాయి.

అమానత్ మే ఖియానత్ హెూ రహీ హై - సలీఖే సే తిజారత్ హెూ రహీ హై

నహీం మహ్‌ఫూజ్ కోయీ అప్నే ఘర్ మే - మగర్ ఘర్ కీ హిఫాజత్ హెూ రహీ హై

హమ్‌నే ఖూన్ సే సీంచా వతన్ కో - హమ్‌సే ఫిర్ షికాయత్ హెూ రహీ హై

బజాహిర్ మిల్ రహే హైం సబ్ సభీ సే - మగర్ అందర్ బఘావత్ హెూ రహీ హై - **జకియా గజల్**

## ఖియానత్, అమానత్‌కు విరుద్ధం

ఇమామ్ రాగిబ్ (రహ్మ) ఇలా వ్యాఖ్యానించారు: "ఖియానత్, నిఫాక్- రెండూ దగ్గర దగ్గరగా ఉంటాయి. కానీ ఖియానత్ అనేది ఒప్పందాలు, అమానతులకు సంబంధించినది. నిఫాక్ అనేది మత విషయాల్లో వాడబడుతుంది. రెండూ కలిసిపోయే సంద ర్భాలు ఉంటాయి. ఖియానత్ అంటే- రహస్యంగా ఒప్పందాన్ని ఉల్లంఘించడం. దీనికి విరుద్ధం అమానత్."

దైవప్రవక్త ముహమ్మద్(స) వారి ఉత్తమ ప్రవర్తనను మెచ్చి జాతి జనం ఇచ్చిన బిరుదు అమీన్- సచ్ఛీలుడు, సకల సద్గుణ సంపన్నుడు. మేలు మాత్రమే చేసేవాడు. కీడు అస్సలు చేయనివాడు.

ఖియానత్ అనేది అమానత్‌కు పూర్తి విరుద్ధం. ఇది మనిషిలో విశ్వాస లోపానికి ప్రబల తార్కాణం. ఇతరుల హక్కులను ధన, మాన గౌరవం, రహస్యాలు విలువ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం, నాశనం చేయడం లేదా బయట పెట్టడం.

ఇమామ్ జాహిజ్ అన్నారు: "ఖియానత్ అంటే- ఒక మనిషి తన వద్ద భద్రపరచిన ధనం, గౌరవం, రహస్యాలను వాడేసుకోవడం, వాటిని తిరస్కరించడం, సందేశాలను వక్రీకరించడం."

## ఖియానత్ ఘోర పాపం (కబీరా గునాహ్)

ఇమామ్ జహబీ (రహ్మ) ఖియానత్‌ను పెద్ద తరహా పాపాలలో చేర్చారు. ప్రవక్త(స) అన్నారు: మునాఫిఖ్ (కపటి) లక్షణాలు మూడు: మాట్లాడితే అబద్ధం చెబుతాడు, మాట ఇస్తే నిలబెట్టుకోడు, ఏదైనా అప్పగిస్తే ద్రోహం చేస్తాడు." (బుఖారీ, ముస్లిం)

అలాగే మరొక హదీసులో చెప్పారు: "ఎవరు నీకు అమానత్ ఇచ్చారో వారికి అది తిరిగి ఇవ్వు. నీకు ద్రోహం చేసినవారికి కూడా నీవు ద్రోహం చేయవద్దు." (తిర్మిజీ)

ఇమామ్ జహబీ ఇలా అన్నారు: "ఖియానత్ పూర్తి నష్టదాయకమైనది. కొన్ని ఖియానత్‌లు మరింత ఘోరమైనవి. చిన్న మొత్తంలో మోసం చేయడం ఒకటైతే, భార్యాభర్తల హక్కులు లేదా పెద్ద ఆస్తుల్లో ద్రోహం చేయడం ఇంకా పెద్ద నేరం."

అబూ బక్ర్ సిద్దీఖ్ (రజి) ఇలా అన్నారు: "అత్యంత తెలివైనవాడు ఎవడంటే- భయభక్తితో జీవించేవాడు. అత్యంత మూర్ఖుడు ఎవడంటే- పాపాలకి బానిసైనవాడు. అత్యంత నిజాయితీపరుడు, సత్యవంతుడు ఎవరు అంటే- అమానత్‌ని కాపాడేవాడు. అత్యంత జుగుప్సాకరమైన అబద్ధం ఏమిటి అంటే- ద్రోహం చేయడం."

## దేశ ద్రోహం

ఎవరైనా వ్యక్తి విదేశీ ప్రయోజనాలను కాపాడుతూ, తన దేశ ప్రయోజనాలను త్యజిస్తే, అది మహా ద్రోహం అవుతుంది. ఇది దేశ భద్రత, రాజకీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తుంది. వీరి ఉద్దేశ్యం- దేశంలో విధ్వంసం, గందరగోళం, అశాంతి సృష్టించడం, శత్రువులకు అనుకూల వాతావరణం కల్పించడం.

"ఒక జాతి వల్ల ద్రోహం కలుగుతుందని అనుమానం కలిగితే, వారితో ఒప్పందాన్ని స్పష్టంగా రద్దు చెయ్యి. ఎందుకంటే అల్లాహ్ ద్రోహులను ప్రేమించడు." (అల్-అన్ఫాల్: 58)

## ఖియానత్ గురించి ప్రవక్త హెచ్చరిక

ఇమ్రాన్ బిన్ హుసైన్ (ర.అ) కథనం: ప్రవక్త ఇలా అన్నారు: "ఉత్తములు నా తరం, తరువాత వారిని అనుసరించేవారు, ఆ తరువాత వారిని అనుసరించేవారు. ఆ తరువాత ఒక తరం వస్తుంది: సాక్ష్యం అడగకపోయినా వారు సాక్ష్యం ఇస్తారు, నమ్మకం పెట్టుకుంటే ద్రోహం చేస్తారు, మొక్కుబడి చేసుకుంటే నెరవేర్చరు, వారిలో మాంసం, కొవ్వు పెరుగుతుంది." (ముత్తఫఖున్ అలైహి)

అబూ హురైరా(ర.అ) కథనం: ప్రవక్త ఇలా అన్నారు:"ప్రజలపై మహా మోసపూరిత దశ ఒకటి వస్తుంది. అప్పుడు- అబద్ధాన్ని నమ్ముతారు, నిజాన్ని తిరస్కరిస్తారు, ద్రోహిని నమ్ముతారు, నమ్మకస్థుడిని అనుమానిస్తారు. రువైబిదా మాట్లాడతాడు." సహాబాలు అడిగారు: "రువైబిదా అంటే ఎవరు?" "సామాజిక వ్యవహారాలలో జోక్యం చేసుకునే తక్కువ విలువైన వ్యక్తి." (ఇబ్ను మాజహ్). వారిలోని ప్రతోడు వేదికలెక్కి ఊకదంపుడు ఉపన్యాసాలిస్తాడు.

అబూ హురైరా (ర.అ) కథనం : ప్రవక్త ఇలా అన్నారు: "ఎవరైనా నా మీద నేను చెప్పని మాటలు కల్పిస్తే, అతని స్థానం నరకంలో ఉంటుంది. ఎవరైనా జ్ఞానం లేకుండా ఫత్వా ఇస్తే, దాని పాపం అతనిపైనే ఉంటుంది. తన సోదరుడు సలహా అడిగితే, తప్పుడు సలహా ఇస్తే, అతను అతనికి ద్రోహం చేసినట్లే." (సహీహ్ అల్-జామిఉస్ సగీర్)

అబూ సయీద్ (ర.అ) కథనం: ప్రవక్త ఇలా అన్నారు: "ప్రతి ద్రోహికి రేపు ప్రళయదినాన ఒక జెండా ఎత్త బడుతుంది. అతని ద్రోహం ఎంత ఎక్కువ ఉంటే, జెండా అంత ఎత్తుగా ఉంటుంది. వినండి! ప్రజల నాయకుడైన వ్యక్తి చేసే ద్రోహం కంటే పెద్ద ద్రోహం ఏదీ లేదు." (ముస్లిం)

నమ్మక ద్రోహం అవతలి వారికే కాదు,నమ్మక ద్రోహానికి పాల్పడే వారికి కూడా అపాయకరమే.మనం ఎదుటి వారిని ఏమి చేస్తామో అంతకు మిక్కిలి మనకు సంక్రమించి తీరుతుంది- కీలకమైన బాధ్యతలో ఉంటూ నమ్మకద్రోహం చేస్తే నువ్వు దొంగ కన్నా ప్రమాదకారివి.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక సహాబి సదఖా వసూలు చేసి వచ్చి అన్నాడు: ''ఇది మీకోసం, ఇది నాకు బహుమతి.'' ప్రవక్త ఇలా అన్నారు: ''ఎందుకు? మనం ఒకరిని పనికి పంపితే, అతను తిరిగి వచ్చి -ఇది మీ కోసం, ఇది నాకు బహుమతి అంటాడా? అతను తన తండ్రి ఇంట్లో కూర్చో మనండి, బహుమతి ఎలా వస్తుందో చూద్దాం! ముహమ్మద్ ప్రాణం తన చేతిలో ఉన్న అల్లాహ్ మీద ప్రమాణం, మీలో ఎవరైనా ఏదైనా దాచుకుంటే, ప్రళయ దినాన దానిని తన మెడపై వేసుకుంటూ - అది ఒంటె అయితే దాని అరుపుతో, ఆవు అయితే దాని అరుపుతో, గొర్రె అయితే దాని శబ్దం చేస్తూ వెళ్తాడు.'' తర్వాత ఆయన చేతులు ఎత్తి మూడు సార్లు అన్నారు: ''ఓ అల్లాహ్! నేను (సందేశాన్ని) చాటిచెప్పాను కదా!'' (బుఖారీ, ముస్లిం)

## అమానతు - ఓ పవిత్రమైన బాధ్యత

ఇబ్ను మసూద్ (రజి) కథనం- ఇమామ్ అహ్మద్ (అల్-జుహ్ద్, ముస్నద్), బైహఖీ వర్ణించిన హదీసులో ప్రవక్త (స) ఇలా అన్నారు: ''అల్లాహ్ మార్గంలో పోరాడుతూ చనిపోయిన వ్యక్తి అన్ని పాపాలు క్షమించబడతాయి. కానీ అమానత్ మాత్రం మన్నించబడదు''. తరువాత ఆయన వివరించారు:''ఒక బానిసను ప్రళయ దినాన తీసుకువస్తారు. అతను అల్లాహ్ మార్గంలో పోరాడి చనిపోయిన వాడే. అప్పుడు అతనితో చెబుతారు: నీకు అప్పగించబడిన అమానత్‌ను తిరిగి ఇవ్వు! అతను చెబుతాడు: ఓ ప్రభూ! నేను ఎలా తిరిగి ఇస్తాను? ఇహలోకం పోయింది కదా! అప్పుడు - ఇతన్ని హావియాలో (నరకంలో) పడేయండి. అతనికి తన అమానత్, అప్పగించిన రోజు ఉన్న రూపంలో కనబడుతుంది. దాన్ని చూసి అతను గుర్తిస్తాడు, దాని వెనకపడి భుజాన ఎత్తుకొని తీసుకుపోతాడు. నరకాగ్ని నుండి బయట పడతానని అనుకున్నప్పుడు అది జారి పోతుంది. మళ్లీ దాని వెనక పడతాడు. ఇలా ఆ ప్రక్రియ నిత్యం కొనసాగుతూనే ఉంటుంది.'' తర్వాత ఆయన అన్నారు: ''నమాజు ఒక అమానత్, వుజూ ఒక అమానత్, కొలతలు ఒక అమానత్, తూకాలు కూడా ఒక అమానత్ . ఇంకా ఆయన కొన్ని విషయాలను లెక్కపెట్టారు. వాటిలో అత్యంత భారమైనది వదాయె (అప్పగించిన వస్తువులు).''

ఇరవై ఏళ్ల వయసులో మస్జిద్‌కి పోకుంటే దోషం... అరవై ఏళ్లు దాటాక ప్రార్థనాలయానికి పోవాలాంటే ఆయాసం. ఆశ పేరాశల ఊగిసలాడే ఈ జీవితంలో అన్ని దశలు దాటి దాటి ఆయాస దశ దాపురించకముందే యువత వారిలోని ఈ దోష సవరణ, దైవ ద్రోహ నివారణ చేసుకోవాలి.

జాధాన్ (రహ్మ) అన్నారు: ''నేను బరా ఇబ్ను ఆజిబ్ (ర.అ) వద్దకు వెళ్లి అన్నాను: ఇబ్ను మసూద్ చెప్పినదానిని మీరు విన్నారా? ఆయన చెప్పారు: ''అవును, నిజమే. మీరు అల్లాహ్ వాక్యం వినలేదా?''-

''అల్లాహ్ మీకు అమానతులు వాటి యజమానులకు తిరిగి ఇవ్వమని ఆజ్ఞాపిస్తున్నాడు.'' (అన్-నిసా: 58)

## ఖియానత్ (ద్రోహం) రూపాలు

''ఖియానత్'' అనే పదం మనసులోనే భయానకమైన భావనను కలిగిస్తుంది. దానిని విన్న వెంటనే ద్రోహం, కుట్రలు, హత్యలు, గూఢచర్యం మొదలైనవి గుర్తుకు వస్తాయి. కానీ ప్రజలు చిన్నచిన్న విషయాల్లో కూడా ఖియానత్ చేస్తుంటారు. వాటిని వారు తక్కువగా భావిస్తారు. కాని వాస్తవానికి అవి అత్యంత ప్రమాదకరమైనవే.

## ఖియానత్ రకాలు


**ధర్మ ద్రోహం** : అల్లాహ్, ఆయన ప్రవక్త యెడల ఖియానత్- హద్దులను అతిక్రమించడం, ఫరాయిజ్‌ను వదలిపెట్టడం, ముహర్రమాత్లకు, నిషేధిత విషయాలకు తెగబడటం.

**దేశ ద్రోహం** : దేశ ద్రోహులతో, శత్రు సైన్యాలతో స్నేహం చేయడం, వారిని ప్రోత్సహించడం, వారితో రహస్య సఖ్యతను కలిగి ఉండటం.

**కుటుంబ ద్రోహం** : భార్యాభర్తల రహస్యాలను బయటపెట్టడం. వెనుక మార్గం గుండా ఇంటి వారికి తెలియకుండా దూరడం, లేదా గోడెక్కి దూకడం.

**మిత్ర ద్రోహం** : నమ్మకస్థుడే నమ్మకద్రోహి! నమ్మించి గొంతు కోయడం. తడి గుడ్డతో గొంతు కోయడం. తేనే పూసిన కత్తి - తియ్యగా మాట్లాడుతూ మనకెంతో ఉపకారి అని నమ్మించి అపకారం తలపెట్టడం. తేనె పూసిన కత్తి: అంటే, ఒక వ్యక్తి బయట నుంచి తియ్యగా, మృదువుగా మాట్లాడుతూ, లోపల కుట్రలు, మోసం లేదా దుష్ట ఆలోచనలు కలిగి ఉంటాడు. వీరి మాటలు తేనెలా తీయగా ఉన్నా, వారి ఉద్దేశ్యం మాత్రం ప్రమాదకరంగా ఉంటుంది.

దీన్నే తడి గుడ్డతో గొంతు కోయడం అంటారు.. తడి గుడ్డతో గొంతు కోయడం అసాధ్యం: అలాంటి దుర్మార్గపు పనులను గుట్టు చప్పుడు కాకుండా చేసేసి ఏమి ఎరగనట్టు వుండే వారిని గురించి ఈ సామెత పుట్టింది. వీడు తడి గుడ్డతో గొంతు కోసే రకం అని అంటారు. కత్తితో గొంతు కోస్తే అందరికీ తెలుస్తుంది. కానీ తడిగుడ్డతో గొంతు కోస్తే ఎవరికీ తెలియదు.



# అల్లాహ్ నామంతో

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**అల్లాహ్ నామం**లో ఎంతో మృదుత్వం ఉంది. ఎంతో మాధుర్యం ఉంది. ఎంతో చల్లదనం ఉంది. ఎంతో ప్రశాంతత ఉంది. ఎంతో ధైర్యం ఉంది. ఎంతో ఆధారం ఉంది. స్వర్గమూ ఉంది. శిశువు తొలి పలుకు అల్లాహ్‌తోనే ప్రారంభమవుతుంది. ఆ పలుకులో ఎంతో అనిర్వచనీయ ఆనందం ఉంది. మాటలకు అందని మహత్తు ఉంది. ఆ శబ్దంలో ఆ కరుణామయునికి సర్వ మానవాళి సమర్పించే కృతజ్ఞతాపూర్వక వందనం అల్లాహ్.

అందుకే పని ప్రారంభించే ముందు దైవం పేరుతో ప్రారంభించాలన్నది మహాప్రవక్త(స) బోధన. ఉదయం లేచింది మొదలు పని చేసేటప్పుడు, రాసేటప్పుడు, చదివేటప్పుడు, లేచేటప్పుడు, కూర్చునేటప్పుడు- ఒకటేమిటి ప్రతి చిన్న పని నుంచి పెద్ద కార్యం వరకూ చేసే ప్రతిదీ దేవుని పేరనే ప్రారంభించాలని ఆయన అన్నారు.

మనిషి జీవితంలో అనేక సమస్యలు, పరీక్షలు ఎదురవుతాయి. కొన్ని బాధలు అంచనా వేయలేని విధంగా మన ప్రగతిని అడ్డుకుంటూ, మన మనసును వణికిస్తాయి. కాని అల్లాహ్ నామంతో మొదలుపెట్టిన ప్రతి పని అది ఒక ఆశ, ఒక ఆశయంగా మారిపోతుంది. అల్లాహ్ సాయం చేయని పని ఏదీ లేదు. బిస్మిల్లాహ్ (అల్లాహ్ నామం)తో, వచ్చే కష్టాలు కూడా తొలగిపోతాయి.

అల్లాహ్ నామంతో అంటే అది కేవలం మాట కాకుండా ఒక నమ్మకపు దృష్టి కోణం. మన హృదయంలో ఉన్న అనిశ్చితిని తొలగించి, మన పథాన్ని దృఢం చేసే ఒక ఆధ్యాత్మిక బలం. ఇది మనకు తెలియజేస్తుంది "నీవు ఒంటరిగా లేవు... అల్లాహ్ నీతో ఎల్లప్పుడు ఉన్నాడు" అని. అల్లాహ్ నామంతో ప్రారంభించిన ప్రతి అడుగు విజయానికి మార్గం (స్వర్గానికి మార్గం) అవుతుంది.

పూర్వ కాలంలో అరేబియా మైదానంలోని ఒక చిన్న గ్రామంలో యూనుస్ అనే యువకుడు ఉండేవాడు. అతడు ఎవరికి హాని కలిగించే పని చేసేవాడు కాదు. అల్లాహ్ చెప్పిన హద్దుల్లో ఉంటూ దైవప్రవక్త ముహమ్మద్(స) దారిలో నడిచేవాడు. అతని జీవితం చాలా సాధారణంగా ఉండేది. ఊరిలో ధనవంతులు ఎక్కువగా ఉండేవారు.దైవాన్ని పూర్తిగా మరిచిపోయి తన ఇష్టానుసారంగా జీవితాన్ని గడిపేవారు. విచ్చలవిడిగా దుబారా ఖర్చులు చేసేవారు. పేదవారికి ఎటువంటి సహాయం చేసేవారు కాదు.

ఒకరోజు గ్రామంపై భయంకరమైన మేఘాలు కమ్ముకున్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, చిమ్మ చీకటి అలుముకున్నాయి. ప్రజలందరూ భయభ్రాంతులకు గురయ్యారు. పక్షులన్నీ తమ తమ గూటికి వెళ్ళిపోయాయి.

**మిగతా 34వ పేజీలో...**




**ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న జరుపుకునే ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం.** మానవ ఆరోగ్య రక్షణలో ఔషధ నిపుణులు పోషించే కీలక పాత్రకు గౌరవ సూచకం. వైద్య అత్యవసర పరిస్థితులు, దీర్ఘకాలిక వ్యాధులు, లేదా చిన్న ఆరోగ్య సమస్యలు ఏవైనా- ఫార్మాసిస్టులు ఎప్పుడూ మనకు మొదటి సహాయకులు. దగ్గు, జలుబు, తేలికపాటి జ్వరం లేదా చర్మంపై చిన్న మచ్చ వచ్చినా, చాలా సందర్భాల్లో మనం ముందుగా డాక్టర్ వద్దకు కాకుండా ఫార్మాసిస్ట్ వద్దకే వెళ్తాము.

అందువల్ల, ఫార్మాసిస్టులు కేవలం “కౌంటర్ వెనుక” ఉండే వ్యక్తులు కాదు. వారు రోగుల భద్రత, ఔషధాల సరైన వినియోగం, ఆరోగ్య జాగ్రత్తల విషయంలో అత్యంత నిపుణులైన మార్గదర్శకులు. ఈ రోజు, వారి సేవలను గుర్తించి ఆరోగ్య రంగపు మౌన వీరులకు మనం కృతజ్ఞతలు చెప్పే రోజు.

మొత్తానికి, ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం జరుపుకోవడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం- ఫార్మాసిస్టులు ఆరోగ్య రంగానికి చేస్తున్న అపారమైన సేవలను గుర్తించి గౌరవించడం, ప్రజల్లో వారి పాత్రపై అవగాహన కలిగించడం.

### ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం ఎందుకు జరుపుకుంటారు?

ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం (World Pharmacists Day)ను 2009లో టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన FIP (International Pharmaceutical Federation) కౌన్సిల్ సమావేశంలో ప్రారంభించారు. ఈ దినోత్సవం ఉద్దేశ్యం- ప్రపంచంలోని ప్రతి మూలలో ఆరోగ్యం మెరుగుపరిచే ప్రక్రియలో ఫార్మాసిస్టుల పాత్రను గుర్తించడం, ప్రోత్సహించడం, ప్రజల్లో అవగాహన పెంచడం. ఫార్మాసిస్టుల వల్లనే ప్రజలు తమకు సూచించిన ఔషధాల నుండి పూర్తి ప్రయోజనం పొందగలుగుతున్నారు. వారు తమ అనుభవం, జ్ఞానం, నైపుణ్యాన్ని ఉపయోగించి వైద్యరంగాన్ని అందరికీ మరింత మెరుగైనదిగా మార్చుతున్నారు. మందులు అందుబాటులో ఉంచడం, వాటిని సరిగా ఎలా వాడాలో సూచించడం, ఆరోగ్యంపై కీలక సలహాలు ఇవ్వడం- ఇవన్నీ ఫార్మాసిస్టుల ముఖ్యమైన సేవలు.

### ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (FIP) అంటే ఏమిటి?

ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవానికి వ్యవస్థాపక సంస్థ అయిన ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (FIP) అనేది ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ సైన్స్‌లు, ఫార్మాస్యూటికల్ విద్యకు ప్రతినిధిగా నిలిచే అంతర్జాతీయ సంస్థ.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న 144 జాతీయ సంస్థలు, అకాడమిక్ సంస్థలు, వ్యక్తిగత సభ్యుల ద్వారా, ఈ సంస్థ లక్షలాది ఫార్మా

సిస్టులు, ఔషధ శాస్త్రవేత్తలు, ఔషధ విద్యావేత్తలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇది ఒక స్వతంత్ర (Non-Governmental Organisation - NGO) సంస్థ, దీని ప్రధాన కార్యాలయం నెదర్లాండ్స్‌లో ఉంది. తమ భాగస్వామ్యాలు, విస్తృతమైన ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ సైన్స్‌ల నెట్‌వర్క్ ద్వారా, ఈ సంస్థ:

ఫార్మసీ వృత్తి అభివృద్ధికి సహకరించడం, ప్రాక్టీస్, కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల ద్వారా ముందుకు నడిపించడం, ప్రపంచ ఆరోగ్య అవసరాలు, అంచనాలకు అనుగుణంగా ఫార్మసీ వర్క్‌ఫోర్స్‌ను తీర్చిదిద్దడం వంటి ముఖ్యమైన పనులను చేస్తుంది. మొత్తంగా, FIP అనేది ప్రపంచ వ్యాప్తంగా ఫార్మాసిస్టులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఆరోగ్యరంగ భవిష్యత్తు కోసం దారితీసే అంతర్జాతీయ సంస్థ.

సెప్టెంబర్ 25న ప్రతి సంవత్సరం జరుపుకునే ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం (World pharmacists Day) 2025 సంవత్సరానికి ప్రకటించిన థీమ్:

Think Health, Think Pharmacist ("ఆరోగ్యం గురించి ఆలోచిస్తే - ఫార్మాసిస్టును ఆలోచించండి")

## ఈ థీమ్ ఎందుకు?

Think Health, Think Pharmacist అనే ఈ సంవత్సరపు థీమ్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్యరంగ సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ఎంపిక చేయబడింది.

## ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం 2025 లక్ష్యం

ఈ రోజు, ఫార్మాసిస్టుల అసాధారణమైన సేవలను గుర్తించి ఆరోగ్య విధానాల్లో వారికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్ణయాధికారులు, ప్రభుత్వాలు, ప్రజలకు ఫార్మాసిస్టుల పాత్ర ఎంత కీలకమో గుర్తుచేయాలని, ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (FIP) ఈ ప్రచారం ద్వారా అన్ని రంగాల ఫార్మా సిస్టులను ఒకే వేదికపైకి తీసుకొస్తోంది. మొత్తంగా Think Health, Think Pharmacist అనే ఈ సంవత్సరపు థీమ్ మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది- ఆరోగ్యాన్ని ఆలోచించిన ప్రతిసారి, ఫార్మాసిస్టుల పాత్రను గుర్తు పెట్టుకోవాలి. వారు లేకుండా ఆరోగ్యరంగం అసంపూర్ణం!

ప్రపంచ ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ మరింత సంక్లిష్టంగా, పరస్పర అనుసంధానంతో మారుతోంది. ఈ సందర్భంలో, మంచి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం, బలమైన, స్థిరమైన ఆరోగ్య వ్యవస్థలను నిర్మించడం, అలాగే ఆరోగ్య అసమానతలను తగ్గించడం అత్యవసరమైంది.

కోవిడ్-19 మహమ్మారి ఈ అవసరాన్ని బలంగా స్పష్టపరిచింది. దాంతో అనేక దేశాలు మరియు సంస్థలు ప్రస్తుత, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు కొత్త ప్రపంచ ఆరోగ్య వ్యూహాలను రూపొందించాయి.

## ఈ దినోత్సవ ప్రాధాన్యం

నేటి ఫార్మాసిస్టులు చేసే పనులు కేవలం ఔషధాల పంపిణీకి పరిమితం కావు. డయాబెటిస్, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల పర్యవేక్షణ. ఔషధ భద్రత, వినియోగంపై రోగులకు శిక్షణ ఇవ్వడం. కోవిడ్-19 మహమ్మారి వంటి ప్రపంచ సంక్షోభాల్లో ముందుండి టీకాలు ఇవ్వడం, ప్రజలకు అవగాహన కల్పించడం.

ఫార్మాసిస్టులు వైద్య వ్యవస్థకు అపూర్వమైన సహాయకులు అన్న విషయం ఈ దినోత్సవం ద్వారా మరింత స్పష్టమవుతుంది.

## ఔషధ అవగాహన కార్యక్రమాలు

సెప్టెంబర్ 25 ముందు వారంలో అనేక దేశాలు ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహిస్తాయి:

ఫార్మసీల్లో వర్క్‌షాప్‌లు, ఉచిత వైద్య సలహాలు. వెబినార్‌లు, ప్రదర్శనలు ద్వారా ఔషధాల సరైన వినియోగంపై ప్రజలకు అవగాహన. సమాజంతో నేరుగా కలిసే ఆరోగ్య శిబిరాలు.

ఈ కార్యక్రమాలు ఫార్మాసిస్టులను ప్రజలకు మరింత దగ్గరగా పరిచయం చేస్తాయి.

## ఎలా జరుపుకోవాలి?

ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవాన్ని ఇలా జరుపుకోవచ్చు:

1. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ ఈవెంట్లలో పాల్గొనండి.
2. స్థానిక ఫార్మాసిస్టుకు ధన్యవాదాలు తెలపండి
3. సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయండి-
4. ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించండి
5. డిజిటల్ ప్రమోషన్ - మెసేజ్‌లు, పోస్టర్ల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచండి.

## భవిష్యత్తు దిశ

ప్రపంచ ఆరోగ్య అవసరాలు పెరుగుతున్న కొద్దీ, ఫార్మాసిస్టుల పాత్ర మరింత విస్తరించనుంది:

టెలిమెడిసిన్, డిజిటల్ హెల్త్ సేవల్లో మరింత భాగస్వామ్యం.

వైద్య సేవలు తక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో సహాయం. ప్రివెంటివ్ హెల్త్ కేర్, పర్సనలైజ్డ్ మెడిసిన్ లో పెద్ద పాత్ర.

## ఆరోగ్య రంగంలో

ఆర్థిక ఒత్తిళ్లు, బడ్జెట్ కోతలు, పెరుగుతున్న ఆరోగ్య అవసరాలు - ఇవి అన్నీ నాణ్యమైన ఆరోగ్య సిబ్బందిని కొనసాగించడంలో పెద్ద సవాలు అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో, ఖర్చు తగ్గించడానికి అర్హత లేని సిబ్బందిని ఫార్మాసిస్టుల స్థానంలో నియమించడం జరిగింది. ఇది తాత్కాలిక పరిష్కారం అయినప్పటికీ, దీని ఫలితాలు ప్రజా ఆరోగ్యానికి ప్రమాదకరమైనవి.

## శిక్షణ పొందిన ఫార్మాసిస్టులు లేకపోతే...

మందుల భద్రత లోపిస్తుంది, ఆరోగ్య సేవల నాణ్యత తగ్గుతుంది, ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది.

## ఫార్మాసిస్టుల కీలక పాత్ర

ఫార్మసిస్టులు కేవలం మందులు ఇవ్వడం మాత్రమే కాదు - సరైన విధంగా ఔషధ వినియోగం నిర్ధారించడం, టీకాలు అందించడం, ప్రజారోగ్యానికి మద్దతు ఇవ్వడం, ఖర్చు తక్కువగా, సులభంగా అందే ఆరోగ్య సేవలు అందించడం - ప్రత్యేకించి ఆరోగ్య సేవలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో. అందుకే ఫార్మాసిస్టులపై పెట్టుబడి పెట్టడం అంటే భద్రమైన, స్థిరమైన ఆరోగ్య వ్యవస్థలు నిర్మించడం. వారిని అర్హత లేని సిబ్బందితో భర్తీ చేయడం అంటే ఆర్థికంగానూ, మానవ వనరుల పరంగానూ నష్టమే.

ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు (SDGs) అను గుణంగా, ఈ వ్యూహాలు పలు పరిష్కారాలను సూచిస్తున్నాయి:

ఆరోగ్య వ్యవస్థలను బలపరచడం (ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య సేవలకు సులభంగా ప్రాప్యత కల్పించడం),

## ఆరోగ్య ప్రమాదాలను నివారించడం

ఆరోగ్య సంక్షోభాలకు సిద్ధం కావడం, సమర్థవంతంగా స్పందించడం.

మొత్తంగా, ప్రపంచ ఆరోగ్యానికి ఎదురవుతున్న సవాళ్లు విస్తృతమైనవే అయినప్పటికీ, బలమైన విధానాలు, సుస్థిర ఆరోగ్య వ్యవస్థలు, సమన్వయకృత చర్యలతో వాటిని అధిగమించడం సాధ్యమే. ఫార్మాసిస్టులు ఆరోగ్య రంగపు మౌన వీరులు. వారు మన ఆరోగ్యాన్ని కాపాడటంలో, మందుల భద్రతా నిర్వహణలో, రోగనిరోధక సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం మనకు ఈ వృత్తి విలువను గుర్తుచేస్తూ, వారికి మన కృతజ్ఞతలు తెలియజేసే మంచి అవకాశం.

## ఫార్మాసిస్ట్

జబ్బు తాకితే మనసు కుంగిపోతుంది,
ఆశలు చీకటిలో మగ్గిపోతాయి.
అప్పుడే ఒక చిరునవ్వుతో,
ఒక మాత్రతో, ఒక సిరప్‌తో
మనలో నమ్మకం నింపే చేతి పేరు– ఫార్మాసిస్ట్.

విజ్ఞానం అతని ఆయుధం,
సేవ అతని వ్రతం,
జాగ్రత్త అతని ప్రతిజ్ఞ,
ప్రాణరక్షణ అతని లక్ష్యం.
డాక్టర్ రాసిన పత్రికలో ఆశలు ఉంటే,
ఫార్మాసిస్ట్ ఇచ్చిన మందులో జీవం ఉంటుంది.
అణువు నుంచి అణువుగా సత్యాన్ని వెతికి,
ప్రతి మాత్రలో జీవశక్తి నింపి,
ప్రతి రోగికి "ఆరోగ్యమే మహాభాగ్యం" అని
మనసారా చూపించే వాడు.

ఔషధ శాస్త్రం– జ్ఞాన సముద్రం.
ఆ సముద్రంలో ఈదే నావికుడు,
ఆరోగ్యాన్ని తీరం చేరుస్తాడు–
అతనే ఫార్మాసిస్ట్.



# ప్రవక్త అడుగుజాడల్లోనే సాఫల్య పథం

సయ్యిద్ హుసైన్

**ఆదీ** నుండి మానవుడు మార్గం తప్పినప్పుడల్లా వారిని నిజమైన మార్గంలో నడపటానికి అల్లాహ్ ఎందరో ప్రవక్తల్ని పంపాడు. ఈ పరంపరలో మొట్టమొదటి ప్రవక్త ఆదం (అలైహిస్సలామ్), చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వ సల్లమ్. ముహమ్మద్ (స)తోనే ప్రవక్తల పరంపర పరిసమాప్త మయ్యింది. ఇక ఈ ప్రపంచంలో ఎవరైతే ఆయన (స) మార్గదర్శ కత్వంలో నడుచుకుంటారో, వారు మాత్రమే ఈ లోకంలో, రేపు పరలోకంలో సఫలీకృతులవుతారని దివ్య ఖుర్ఆన్, ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచనాలు (హదీసులు) సెలవిస్తున్నాయి.

ప్రవక్తలు సంపదలు ప్రోగుచేయడానికో, యుద్ధాలు చేయడానికో లేదా రాజ్యాలు ఏలడానికో రాలేదు. ప్రపంచంలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపడానికి, బలవంతుడు బలహీనునిపై చేసే దౌర్జ న్యాన్ని నిలువరించడానికి, ఒక్కమాటలో చెప్పాలంటే, చెడుగు లతో చెదలు పట్టిన మానవ సమాజాన్ని అల్లాహ్ చూపిన మార్గంలో నడిపి సమాజంలో మృగ్యమైపోయిన న్యాయం, ధర్మం, సోదరత్వాన్ని, సమానత్వాన్ని సుస్థాపితం చేయడమే ప్రవక్తల రాకలోని అసలు ఉద్దేశం.

పుట్టిన ప్రతి మనిషికి జీవితంలో ప్రతి చిన్న విషయానికి ఒక మార్గదర్శి (గైడ్) అవసరం. ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వెళ్ళాలంటే దారి చూపే వాళ్ళుంటారు. ఇలా మనిషికి ఎల్లవేళలా ఏదో ఒక సందర్భంలో ఒక గైడ్ అవసరం.

ఈ కొన్నాళ్ళ ప్రాపంచిక జీవితంలోనే వివిధ సందర్భాలలో ఎందరో సహాయం చేస్తేగాని తన జీవితాన్ని గడపలేడు మనిషి. మరి శాశ్వతమైన పరలోక జీవితంలోని స్వర్గంలో హాయిగా ఉండా లంటే ఒక గైడ్ (మార్గదర్శి) అవసరం లేదా? మనిషి తన ప్రాపంచిక, పారలౌకిక జీవితాలు సఫలం కావాలంటే అన్ని విధాల చక్కని ఆదర్శం కేవలం ప్రవక్త ముహమ్మద్ (స)లోనే ఉందని సృష్టికర్త అయిన అల్లాహ్‌యే దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు :

"వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది: అల్లాహ్‌పై, అంతిమదినంపై ఆశలు పెట్టుకుని అత్య ధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికి."

(అల్ అహ్‌జాబ్ : 21)

"ఓ ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా చేసి, శుభవార్తను ఇచ్చేవానిగా, హెచ్చరిక చేసేవానిగా చేసి అల్లాహ్ అనుమతితో ఆయన వైపు నకు పిలుపు ఇచ్చేవానిగా చేసి, ప్రకాశించే దీపంగా చేసి పంపాము." (అల్ అహ్‌జాబ్ : 45)

జీవితంలోని ప్రతి దశలోనూ, ప్రవక్త ముహమ్మద్ (స) ప్రపంచ మానవాళికి ఉత్తమ ఆదర్శం. తండ్రిగా, భర్తగా, ప్రబోధకునిగా, స్నేహితునిగా, సహాయకునిగా, న్యాయమూర్తిగా, సైన్యాధికారిగా, సైనికునిగా, పాలకునిగా, వైద్యునిగా, హెచ్చరిక చేసేవానిగా ఇలా అన్ని కోణాల్లోనూ ప్రవక్త(స) మనిషికి కావలసిన పరమోన్నత ఆదర్శాన్ని నెలకొల్పి వెళ్ళారు. ఈ ఆదర్శానుసారం తమ తమ జీవితాల్ని దిద్దుకుని చక్కబడినవారు తప్పకుండా ఇహ పర లోకాల్లో విజయవంతమవుతారు.

మానవ జీవితంలోని అన్ని రంగాల్లోనూ ఉత్తమ ఆదర్శాన్ని

నెలకొల్పిన ప్రవక్త (స) మనిషి ఆరోగ్యం విషయంలోనూ ఎన్నో సలహాలను సూచించారు. అలాంటి వాటిలో మచ్చుకు కొన్నింటిని క్రింద పేర్కొనడం జరిగింది :

## ఆరోగ్యం, సంపద

దైవప్రవక్త (స) సెలవిచ్చారు : "ఆరోగ్యం, సంపద దైవం చేత ప్రసాదించబడిన రెండు వరప్రసాదాలు. ప్రజలు సాధారణంగా వీటి విషయంలో మోసానికి, ప్రమత్తతకు లోనయివుంటారు." (జాదుల్ మఆద్)

ఇంచుమించు ఇదే భావాన్నిచ్చే మరో హదీసు బుఖారీలో ఉల్లేఖించబడింది :

సృష్టిశ్రేష్ఠులు ప్రవక్త (స) సెలవిచ్చారు : రెండు వరప్రసాదాల విషయంలో సాధారణంగా ప్రజలు ప్రమత్తతకు లోనయి వుంటారు. ఒకటి ఆరోగ్యం, రెండవది సంపద. (సహీహ్ బుఖారీ)

ప్రాపంచిక సౌఖ్యాభిలాషులైన చాలామంది ఈ రెండు విషయాల్లో అజాగ్రత్తకు లోనయివుంటారనే విషయంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ అజాగ్రత్త కారణంగానే అలాంటి వారు తమ ఆరోగ్యం నిలకడగా ఉంటుందని, తమకు ప్రాప్తమైన సంపద శాశ్వతంగా తమ వద్దనే వుంటుందని తలపోస్తూ ఉంటారు. కాని ఇవి చంచల స్వభావంతో కూడిన నీడలాంటివి. ఈ రోజుంటాయి, రేపు కనుమరుగైపోతాయి. అసలు వాస్తవ మేమంటే మరుక్షణం ఏం జరుగుతుందో మనకే తెలియదు.

తనకు ఆరోగ్యం ప్రాప్తమైనప్పుడు కృతజ్ఞతలు తెలుపడం మనిషి విద్యుక్త ధర్మం, దాని పట్ల గౌరవంగా మెలగాలి. కలిమి ప్రాప్తమైనప్పుడు పేదరికంలో గడిపిన రోజుల్ని గుర్తుకు తెచ్చు కోవాలి. వాస్తవానికి కలిమి అనేది దేవునిచేత ప్రసాదించబడిన గొప్ప కానుక. దీనిపై ఎట్టి పరిస్థితిలోనూ అహంభావానికి, మిడిసి పాటుకు లోనుకాకూడదు.

## ఆరోగ్యం కొరకు ప్రార్థన

తిర్మిజీ షరీఫ్‌లో ఉల్లేఖించిన విధంగా, ఓ సహచరుడు (రజి) దైవప్రవక్త సన్నిధిలో హాజరై విన్నవించుకున్నారు : "ఓ దైవప్రవక్తా! (స)! నమాజ్ తరువాత నేను ఏ దుఆ చేయను?" అని. దానిపై ప్రవక్త (స) సెలవిచ్చారు: "ఆరోగ్యంతో క్షేమంగా ఉండటాన్ని కోరుకో." ఆ అనుచరుడు, మళ్ళీ ప్రశ్నించగా, ఆయన (స) సెలవిచ్చారు : "నీవు నీ ఇహపరలోకాల్లో సౌఖ్యంగా వుండాలని అల్లాహ్‌ను వేడుకో." (తిర్మిజి)

ఇదైతే ఓ పామరుడైన సహాబీకి (అనుచరుడు) ప్రవక్త (స) ఉపదేశించారు. ఇక హజ్రత్ అబ్బాస్ (రజి) గారికి బోధించిన హదీసును పరిశీలించండి.

"ఓ అబ్బాస్ (రజి) బాబాయిగారూ! ఇహపరలోకాల్లో క్షేమంగా ఉండాలని అల్లాహ్‌ను వేడుకోండి."

నిజంగా ఆరోగ్యం ఎంతటి మహాభాగ్యమో! అందుకనే అంతిమ దైవప్రవక్త (స) మాటిమాటికీ ఆరోగ్యం గురించి వేడుకోమని సెలవిచ్చారు: ఎవరైనా సహచరుడు మరో దుఆ కొరకు అభ్యర్థించినా, ఆయన (స) మళ్ళీ ఈ దుఆనే పునరుక్తం చేసేవారు. ఇక దీనిపై కూడా ఆరోగ్యం గురించి శ్రద్ధాసక్తులు చూపక, స్వయం గానూ ఇంకా పరుల ఆరోగ్యం పట్ల ఇలా కృతజ్ఞతా లేమితో ప్రవర్తిస్తే ఇది అల్లాహ్ ప్రసాదించిన వరం పట్ల అపచారం చేసినట్లే. దీనికి ఫలితంగా సృష్టికర్త కఠిన శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుంది. కృతఘ్నులకు, అగౌరవంగా ప్రవర్తించేవారికి ఎలాంటి రాయితీ, లేదా మరో అవకాశమూ లభించవు.

## ఆరోగ్యం గురించి ప్రవక్త (స) దుఆలు

సృష్టిశ్రేష్ఠులు ప్రవక్త (స) ఆరోగ్యంతో క్షేమంగా వుండే విషయంలో కరుణామయుడైన దైవంతో వేడుకున్న విధానాన్ని గమనించండి. అలాంటి వాటిని మేము ఇక్కడ మచ్చుకు కొన్నింటిని అను వాదంతో పేర్కొంటున్నాం. ఇది నసాయి గ్రంథం నుంచి సేకరించబడింది.

"అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుకల్ ఆఫియత ఫిద్యున్‌యా వల్ ఆఖిరతి."

"ఓ దేవా! ఇహపరాల్లో నన్ను ఆరోగ్యంగా, క్షేమంగా వుంచమని వేడుకుంటున్నాను."

ఈ దుఆ అయితే ప్రవక్త (స) తరచూ చేస్తుండేవారు : **అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక సిహ్హతన్ ఫీ ఈమానిన్ వ ఈమానిన్ ఫీ హుస్ని ఖుల్ఖిన్ వ నజాహన్ యుత్‌బివుహూ ఫలాహన్ వ రహ్మతన్ మిన్‌క వ ఆఫియతన్ వ మగ్‌ఫిరతన్ మిన్‌క వ రిజ్‌వానా.**

"ఓ అల్లాహ్! నేను నీ నుంచి విశ్వాసంతో పాటు ఆరోగ్యాన్ని కోరుతున్నాను. విశ్వాసంతో పాటు సృష్టిలో శ్రేష్ఠునిగా ఉండటాన్ని, ఈ జీవితం తరువాత మోక్షాన్ని, నీ కారుణ్యంతో ఆరోగ్యాన్ని, క్షేమాన్ని ఇంకా క్షమాభిక్షను, మన్నింపును అర్థిస్తున్నాను."

## ఆరోగ్యం, పరిశుభ్రతకు ఐదు విధానాలు

దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు :

"సహజసిద్ధంగా ఐదు విధానాలున్నాయి : 1. ఖత్‌నా (సున్నతీ) చేయించటం. 2. నాభిక్రింద (అంటే మర్మాంగాల్లోని) వెంట్రుకల్ని తీసివేయటం. 3. గోళ్ళు కత్తిరించటం. 4. చంకల్లోని వెంట్రుకలు తీయటం. 5. ఇంకా మీసాలు కత్తిరించటం. (బుఖారీ, ముస్లిం)

## మూత్రశుద్ధి

హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఖుబా వాసులతో సెలవిచ్చారు : "అల్లాహ్ మీ పరిశుద్ధతను ఎంతగానో కొనియాడాడు. దీని రహస్యం ఏమిటి?" దానిపై వారు, "మేము మలమూత్రాలను మొదట మట్టిపెడ్డతో ఆపై నీటితో శుభ్ర

పరచుకుంటాం" అని బదులిచ్చారు. (లర్జీన్)

ప్రవక్త (స) సంప్రదాయం ప్రకారం కూడా మల విసర్జన పిదప లేదా మూత్రవిసర్జన తరువాత మొదట మట్టి పెళ్ళలతో శుభ్రం చేశాక నీటితో కడగాలి. ఈ సందర్భంగా అంతిమ దైవప్రవక్త(స) ఎంతో వివరంగా సెలవిచ్చారు. వాటిని మీరు కూడా గమనించండి.

1. మూత్ర విసర్జన సమయంలో కుడిచేతిని వాడకూడదు, ఇంకా ఏదైనా పాత్రలో కూడా మూత్రం పోయరాదు. (సుననె దావూద్, సుననె నసాయి, తిర్మిజి)

2. మలమూత్ర విసర్జన సమయంలో ఎడమ చేతిని ఉపయోగించాలి. (అబూదావూద్)

3. నీటితో పరిశుభ్రం చేసుకునే ముందు మట్టి పెళ్ళను ఉపయోగించాలి. (సుననె అబూదావూద్, నసాయి)

4. ఎముకలు లేదా గుట్టపు లద్దెతో శుభ్రం చేయరాదు. (తిర్మిజి, నసాయి)

ఇదే విషయం ప్రతి హదీసు సంకలనంలోని 'మలమూత్ర పరిశుద్ధత' అధ్యాయాలలో పేర్కొనబడింది.

## మల విసర్జన విధానం

హజ్రత్ సురాఖా బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం: "మాకు దైవప్రవక్త (స) ఆదేశించారు : మల విసర్జన సమయంలో ఎడమ కాలిపై భారంమోపి కుడికాలిని తేలికగా వదలిపెట్టాలని." (అల్ కబీర్ తిబ్రానీ).

ఇక మానవ దేహ నిర్మాణంపై దృష్టిసారించి చూడండి. మానవుడు తిన్న ఆహారం వ్యర్థాల రూపంలో విసర్జింపబడుతుంది. వ్యర్థాలన్నీ ప్రేగుల ద్వారా బయటికి విసర్జింపబడతాయి. ఈ వ్యర్థాలు, మలినాలు ఎడమ వైపున్న ప్రేగులో జమఅయి ఇక్కణ్నుంచి ఇవి మలం రూపంలో బయటికి వస్తాయి.

వైద్యుల అభిప్రాయం ప్రకారం ఎడమ కాలిపై భారం మోపి కూర్చోవటం వల్ల అది ఎడమ వైపున్న ప్రేగుపై వత్తిడి పెరిగి వ్యర్థాలన్నీ పూర్తిగా బయటికి విసర్జితమయ్యే సౌలభ్యం ఏర్పడుతుంది. పొట్ట శుభ్రపడుతుంది. అజీర్ణం అనేది ఇక మిగలదు. మనసు చాలా తేలికగా, ఆహ్లాదకరంగా వుంటుంది. ఉదరం నుంచి, హృదయం నుంచి భారం దిగి మనిషి ఎంతో ఉత్తేజితుడవుతాడు.

నేటికాలంలో పరిశుభ్రత విషయం ఎంతో చర్చనీయాంశంగా మారింది. నిజానికి పరిశుభ్రత అలాంటిది. కాని ఇస్లాం బాహ్యపరమైన శుభ్రతతో పాటు అంతశ్శుద్ధిని పాటించడంలో కూడా ఎంతో ప్రాముఖ్యతనిస్తుంది. ఒకవేళ మనసు పరిశుభ్రంగా లేకుండా కేవలం శరీరం తెల్లగా మెరుస్తున్నా అందులో ప్రయోజనం ఏముంది? ఆత్మ లేక అంతశ్శుద్ధి కొరకు బాహ్యపరంగా కూడా పరిశుభ్రతను పాటించాలి.

## వ్యాధి ద్వారా శ్రేయం, సఫలత

ఇస్లాం ధర్మం సహజమైనది. దాని స్వాభావికమైన సూత్రాలు, నియమాలు అన్నీ సహజంగానే ఉంటాయి. కాబట్టి వ్యాధి ఆపద కాదు, అది దైవ కారుణ్యం. ఇది మన శుభశ్రేయాలకు, మోక్ష సాధనకు సోపానం. హజ్రత్ అబూ హురైరా (రజి)గారు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చినట్లు ఉల్లేఖించారు : ఎవరికైతే అల్లాహ్ లాభం చేకూర్చాలని తలుస్తాడో వారికి కష్టాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తాడు. *(ముఅత్తా ఇమామ్- మాలిక్ కితాబుల్ జామె)*

ఎలాంటి మనిషికైనా వ్యాధి బలహీనతకు గురిచేస్తుంది. దీనిని మన నిత్యజీవితంలో చూస్తుంటాము. వ్యాధికి గురిఅయినప్పుడు గొప్పవారి నోట కూడా అల్లాహ్ నామం దానంతటదే పలుకబడుతుంది. హృదయాంతరాళాల్లో దైవనామ స్మరణ జనిస్తుంది. ఎవరికి అవసాన దశ వస్తుందో ఇక దానికి చికిత్స ఏముంటుంది. కాబట్టి దైవ సందేశహరులు(స) సెలవిచ్చారు: ఒక దాసుడు వ్యాధికి గురైనప్పుడు అతని వద్దకు అల్లాహ్ ఇద్దరు దైవదూతల్ని పంపించి వారితో "వ్యాధికి గురైన వ్యక్తి వద్దకు ఎవరైనా పరామర్శకు వచ్చినప్పుడు నా దాసుడు వారితో ఏమన్నాడు?" అని ఆరా తీస్తాడు. దాసుడు ఏమంటాడో అల్లాహ్‌కు తెలియక కాదు - ఒకవేళ దైవదూతలు వచ్చినప్పుడు ఆ దాసుడు అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ, ఆయన సంకీర్తన చేస్తున్నట్లైతే ఈ వార్తను దైవదూతలు అల్లాహ్‌కు చేరవేస్తారు. ఆపై అల్లాహ్ ఇలా సెలవిస్తాడు : "ఒకవేళ నేను అతనికి మృత్యువునిస్తే అతన్ని స్వర్గంలో ప్రవేశింపజేస్తాను. లేదా స్వస్థతనిస్తే అతని కృశించిన దేహానికి బదులు మంచి దేహాన్ని, చెడు రక్తానికి మారుగా మంచి రక్తాన్ని ఇస్తాను. ఇంకా అతని పాపాలను మన్నిస్తాను." ఈ హదీసును అతా బిన్ యసార్ (రజి) ఉల్లేఖించారు. (ముఅత్తా ఇమామ్ మాలిక్)

## వ్యాధిలో సహనం - స్వర్గానికి సోపానం

కొంతమంది వ్యాధిని ఒక ఆపదగా, అభిశాపంగా తలుస్తారు. అలాంటి వారు ప్రవక్త(స) గారి ఈ హదీసును పఠించి తమ ఆలోచనను మార్చుకోవాలి. ఆయన (స) "వ్యాధి స్వర్గ ప్రవేశానికి ఓ సాకు" అని సెలవిచ్చారు.

ఈ హదీసును అతా బిన్ రబాహ్ (రజి) ఉల్లేఖించారు. ఆయన (స) ఇలా అన్నారు : "నాకు ఈ హదీసును హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) తెలిపారు. ఆయన నాతో 'నేను నీకు స్వర్గ ప్రవేశం చేసే మహిళను చూపించనా' అని అడిగారు. దానికి నేను 'తప్పకుండా చూపండి' అని అన్నాను. ఆపై ఆయన ఇలా అన్నారు: నల్లటి రంగు గల ఒక స్త్రీ ప్రవక్త (స) సన్నిధిలో హాజరై ఇలా విన్నవించుకుంది: "నాకు మూర్ఛ వ్యాధి ఉంది. ఆ స్థితిలో కొన్నిసార్లు నా వస్త్రాలు తొలగిపోతాయి. ఓ దైవప్రవక్తా (స)! నాకు స్వస్థత చేకూరేలా దైవాన్ని ప్రార్థించండి" అని వేడుకుంది.

ఆపై దైవప్రవక్త (స) సెలవిచ్చారు : "నీవు సహనం వహించినట్లైతే నీకు స్వర్గం లభిస్తుంది. నీవు కోరినట్లైతే నీకు స్వస్థత చేకూర్చమని అల్లాహ్‌ను వేడుకుంటాను." తరువాత ఆమె, "నేను సహనం వహిస్తాను" అని అన్నది. మళ్ళీ ఆమె ఇలా వేడుకుంది : ఓ ప్రవక్తా! మూర్ఛ వచ్చినప్పుడు నా దేహంపై ఉన్న వస్త్రాలు తొలగి పోకుండా వుండేలా అల్లాహ్‌తో ప్రార్థించండి." ఆపై ప్రవక్త (స) ఆమె విన్నపం మేరకు దైవంతో అలాగే వేడుకున్నారు. (బుఖారీ, ముస్లిం)

## వ్యాధి - పాపహరం

దుష్ట ప్రవర్తన, పాప కార్యాల కారణంగా వ్యాధికి గురౌతామని కొంతమంది తలపోస్తుండటాన్ని మనం చూస్తూనే వుంటాం. ఇంకా వ్యాధి గత పాపాల ఫలితమని కూడా అనుకుంటారు. వ్యాధి పాపాల ఫలితం కాదు, అది పాపాలకు పరిహారం. ఈ సందర్భంగా కారుణ్యమూర్తి. ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా, మోమిన్‌కు (విశ్వాసికి) ఓ రాత్రి వచ్చిన జ్వరం ద్వారా అల్లాహ్ అతని పాపాలన్నింటినీ క్షమిస్తాడు." (అత్ తర్‌గీబ్ వత్ తర్‌హీబ్)

హజ్రత్ అబూ హురైరా (రజి) గారి ఉల్లేఖనం : ఓసారి ప్రవక్త(స) సన్నిధిలో హాజరైన ఓ వ్యక్తి జ్వరాన్ని ఆడిపోసుకున్నాడు (తిట్టాడు). ఆపై ఆయన (స) సెలవిచ్చారు : "జ్వరాన్ని తిట్టకండి. అగ్ని ఇనుముకు పట్టిన తుప్పును పోగొట్టి దాన్ని కాంతిమంతం చేసినట్లు జ్వరం మీ పాపాలను ప్రక్షాళిస్తుంది." (ఇబ్నెమాజ)

హజ్రత్ ఉమ్ముల్ అలా (ర.అన్‌హా) ఇలా ఉల్లేఖిస్తున్నారు : నేను వ్యాధికి గురయ్యాను. ప్రవక్త (స) నా పరామర్శకు విచ్చేసి ఇలా సెలవిచ్చారు : "ఉమ్ముల్ అలా! మీకు శుభాకాంక్షలు! విశ్వసించిన ముస్లింలకు వ్యాధి సోకితే అగ్ని వెండి, బంగారాల తుప్పును, మలినాన్ని దూరం చేసినట్లు ఆ వ్యాధి ముస్లింల పాపాలను పరిహరిస్తుంది." (సుననె అబూదావూద్)

వ్యాధి ఓ ఆపద లేక అవస్థ అని కొంతమంది అనుకుంటారు. సత్యసంధులైన ప్రవక్త (స) గారి అనేక హదీసుల ద్వారా వ్యాధి మానవుని పాపాలకు పరిహారం (కఫ్ఫారా) అని తెలుస్తోంది.

హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అన్‌హా) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త (స) సెలవిచ్చారు: "విశ్వాసికి ఏ కష్టం వచ్చినా లేక ముల్లు గుచ్చుకున్నా దానివల్ల అతని పాపాలు మన్నించబడటమో లేక దూరమవడమో జరుగుతుంది." (ముఅత్తా కితాబుల్ జామియ)

కాబట్టి మనకు ముల్లు గుచ్చుకున్నా అది మన పాపాల పాలిట పరిహారం ఇంకా చెడులకు దూరం చేయబడతామని తెలుస్తోంది.

హజ్రత్ యహ్యా బిన్ సయీద్ (రజి) ఇలా తెలిపారు : "ప్రవక్త (స) కాలంలో ఒక వ్యక్తి మరణించినప్పుడు, ఎవరో వ్యక్తి 'ఇతని మృత్యువు ఎంత మంచిది! ఇతను ఒక్కసారైనా వ్యాధికి గురవ లేదు' అని అన్నాడు. ఇది విని ప్రవక్త (స) సెలవిచ్చారు : "మీ పట్ల నేను విచారం వ్యక్తం చేస్తున్నాను. మీకేం తెలుసు? అల్లాహ్ ఎవరికైనా వ్యాధికి గురిచేస్తే దాని వలన అతని పాపాలు పరిహ రించబడతాయేమో!" (ముఅత్తా ఇమామ్ మాలిక్ - కితాబుల్ జామిఅ)

## మృత్యువు కొరకు దుఆ చేయరాదు

హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త (స) ఇలా సెల విచ్చారు: "మీలోని ఏ వ్యక్తీ చావును కోరుకోరాదు."

(అబూదావూద్)

"మీలో ఏ వ్యక్తీ కష్టకాలం వచ్చినప్పుడు చావు కొరకు దుఆ చేయరాదు. అయితే ఇలా వేడుకోవచ్చు : ఓ అల్లాహ్! జీవించి ఉండటం నా కొరకు శ్రేయస్కరంగా వున్నంతవరకు నన్ను జీవింపజెయ్యి, ఒకవేళ మృత్యువే నాకు మంచిదని నీవు భావిస్తే, నాకు చావును ప్రసాదించు." (సుననె అబూదావూద్)

సృష్టిశ్రేష్ఠులు (స) చావును కోరుకోవటాన్ని వారించారు. ఆత్మ హత్యను అధర్మమైన (హరామ్) చావుగా ఖరారు చేశారు. కష్టాల్లో కూరుకుని వున్నవారో లేక నిత్య రోగపీడితంగా వున్నవారో మృత్యువు కోసం దుఆ చేస్తారు. ఇంకా తమ చేతులతో ప్రాణాల్ని తీసుకోవాలని తలపోస్తారు. పేదరికంలో, అపజయాల్లో మనసు కకావికలమవుతుంది. అయితే సృష్టికర్త, కరుణామయుడైన దేవుని పట్ల విశ్వాసముంచేవారి దృష్టిలో నిరాశా నిస్పృహలకు తావు లేదు. అవిశ్వాసులే అల్లాహ్ పట్ల నిరాశకు లోనవుతారు. కాబట్టే అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

**లా తైఅసూ మిఁర్రవ్‌హిల్లాహి- ఇల్లల్ ఖవ్‌ముల్ కాఫిరూన్."**

*(ఖుర్ఆన్ 12 : 87)*

భావం:దేవుని కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. దేవుని కారుణ్యం పట్ల అవిశ్వాసులు మాత్రమే నిరాశ చెందుతారు.

## రోగుల పరామర్శ

వ్యాధి తీవ్రత హెచ్చినా, తగ్గినా ఆ సమయంలో మనిషి ప్రవర్త నలో చాలా మార్పు వస్తుంది. అవి నిద్ర, జాగరణల్లో కానివ్వండి, లేక బాధ్యతల నిర్వహణ అయినా లేదా జీవితంలోని హితకర మైన పనుల్లోనయినా వ్యాధి కారణంగా వాటి నిర్వర్తనలో ఆటంకం ఏర్పడుతుంది. ఉదాహరణకు గాయాలైతే వుజూ చేయటంలో ఆటంకం ఏర్పడుతుంది. బలహీనంగా ఉన్నప్పుడు నిల్చొని నమాజ్ చేయటం దుర్లభమనిపిస్తుంది. కళ్ళజబ్బుతో వున్నప్పుడు దైవగ్రంథం ఖుర్ఆన్ పారాయణంలో ఇబ్బంది కలగటం ఇంకా ప్రజాహిత కార్యాల నిర్వర్తనకు కూడా దూరం కావాల్సి వస్తుంది.

ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు మనసులో పుణ్యకార్యాలకు దూరమయి పోతున్నామనే భావన కలవరానికి గురిచేస్తుంది. అయితే కరుణామయుడైన అల్లాహ్ ఇలా తెలియజేశాడు.

అల్లాహ్ దాసుడు వ్యాధికి గురైనప్పుడు, లేదా ప్రయాణంలో ఉన్నప్పుడు అతను ఆరోగ్యంగా వున్నప్పుడు లేదా ఇంటిపట్టున ఉండి పుణ్యార్జన చేసుకున్న విధంగా అతని ఖాతాలో పుణ్యాలు వ్రాయబడతాయి. (బుఖారీ షరీఫ్)

దీని భావమేమంటే వ్యాధిలో నిస్సహాయత కారణంగా, లేక గతంలో నెరవేర్చాలనుకున్న కొన్ని పుణ్యకార్యాలు మిగిలి పోయినా వాటి పుణ్యఫలం అనుకున్న విధంగానే లభిస్తుంది. ఇక వ్యాధి కారణాన లభించాల్సిన అనేకానేక పుణ్యఫలాలు కూడా లభిస్తాయి!

## వ్యాధిగ్రస్తుని దుఆ (వేడుకోలు)

అల్లాహ్ అయిష్టత, కోపోద్రేకత వలన వ్యాధి సోకుతుందని కొంతమంది తలపోస్తుంటారు. తరచూ వ్యాధి సోకటం అనేది దాసుని పరీక్ష కొరకే. ఈ పరీక్ష నుండి గట్టెక్కిన తరువాత దాసుడికి పుణ్యఫలాలు అధికమవుతాయి, గౌరవోన్నతులు పెరుగుతాయి. ప్రతి రోగి దేవుని కోపోద్రేకానికి గురిఅయి, ఆపదల్లో చిక్కు కోవటం అనేది జరక్కపోవచ్చు. వ్యవహారం చివరకు అతనికి విరుద్ధంగా జరగకూడదు. ఒక నిష్టాగరిష్ఠుడు, సహనశీలుడు, ప్రేమపాత్రుడు, అల్లాహ్‌ను నమ్ముకున్న రోగిపై అల్లాహ్ కారుణ్యాలు కురుస్తాయి. వ్యాధి అతని కొరకు కారుణ్య రూపంలో అవతరిస్తుంది. వ్యాధి వలన అతని ధ్యానం, ధ్యాస అంతా అల్లాహ్‌పైనే లగ్నమవటంలో మరింత అధికమవుతుంది. ఈ విధంగా అతని దుఆలు స్వీకరించబడతాయి.

అంతిమ దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు : "మీరు పరామర్శకు రోగి వద్దకు వెళితే మీ కొరకు దుఆ చేయమని అతన్ని కోరండి. నిజానికి అతని దుఆ కూడా దైవదూతల దుఆ లాంటిదే." (ఇబ్నెమాజ)

## ప్రవక్త (స) గారు తుమ్మే విధానం

'కితాబుల్ అఖ్‌లాఖున్నబి (స)' (రచన : హాఫిజ్ షేఖ్ అబూ హయానుల్ అస్‌ఫానీ) నుండి మేము మూడు హదీసులను పేర్కొంటున్నాం. ఈ మూడింటి ఉల్లేఖనకర్త ప్రవక్త (స) గారి ప్రియశిష్యులు హజ్రత్ అబూ హురైరా (రజి).

1. దైవప్రవక్త (స) తుమ్ము వచ్చినప్పుడు మెల్లగా తుమ్మేవారు. ముఖాన్ని పట్టుకునేవారు.

2. తుమ్ము వచ్చినప్పుడు ప్రవక్త (స) తన చేతిని లేక వస్త్రాన్ని ముఖంపై పెట్టి శబ్దం తక్కువ వచ్చేలా చేసేవారు.

3. తుమ్ము వచ్చినప్పుడు ఆయన (స) అరచేతుల్ని ముఖంపై అడ్డంగా పెట్టుకునేవారు. (అల్‌బేనాత్- జిల్‌హజ్జ 1390 హి.)

అల్లాహ్! అల్లాహ్! ప్రవక్త (స) ఎంతటి సంస్కారాన్ని, జాగ్రత్తను తీసుకునేవారు - తుమ్మువలన ఇతరుల ఆరోగ్యంపై ప్రభావం చూపకూడదని.

## తుమ్ము - శకునం

సాధారణంగా ఏదైనా సమావేశంలో తుమ్మినప్పుడు దాన్ని అశుభంగా భావిస్తారు. కొందరు ముస్లింలు కూడా దీన్ని అపశకునంగా భావించటం వల్ల తమ భాషలో, మాటామంతీలో కూడా కొన్ని చెడు జాతీయాలు తయారయ్యాయి.

బాగా గుర్తుంచుకోండి - తుమ్ములో ఎలాంటి అపశకునం లేదు. అంతగా ఆలోచిస్తే ఇది ఒక రోగం కావచ్చు. మన ప్రియప్రవక్త (స) తుమ్ము వచ్చినప్పుడు దైవానికి కృతజ్ఞతలు తెలుపుతూ స్తోత్రం చేయాలని నిర్ణయించారు. కాబట్టి ప్రవక్త (స) సెలవిచ్చారు : "ఎవరికైనా తుమ్మువస్తే 'అల్‌హమ్‌దులిల్లాహ్' అని పలకాలి. అంటే 'సమస్త శుభాలు, స్తోత్రాలు అల్లాహ్ కొరకే' అని అర్థం. ఇది విన్నవారు, 'యర్‌హముకల్లాహ్' - మీపై అల్లాహ్ కారుణ్యం కురియుగాక!- అనాలి. దీనికి సమాధానంగా, తుమ్మినవారు, 'యహ్‌దీకుముల్లాహ్ వ యుస్‌లిహ బాలకుమ్' - అల్లాహ్ నీకు సన్మార్గాన్ని చూపి, నీ పరిస్థితిని చక్కదిద్దుగాక! - అనాలి. (బుఖారీ, అదబుల్ మఫ్రద్)

## ఆవలింత షైతాన్ చర్య

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త (స) సెలవిచ్చారు : "ఆవలింత షైతాన్ చర్య. మీకు ఆవులింత వచ్చినప్పుడు సాధ్యమైనంత వరకు దాన్ని ఆపే ప్రయత్నం చేయండి. ఎందుకంటే మీరు ఆవలిస్తున్న సమయంలో మిమ్మల్ని చూసి, షైతాన్ నవ్వుతాడు." (బుఖారీ)

## చివరి క్షణాల్లో చేసిన దుఆ

ప్రతి ప్రాణీ మరణాన్ని రుచి చూడాల్సిందే. ఇక్కడికి వచ్చిన ప్రతివారూ ఒకరోజు ఇక్కడ్నుంచి శాశ్వతంగా ఉండే చివరి మజిలీకి చేరుకోవాల్సిందే. జీవితంలోని చివరి క్షణాలు తన కొరకైనా, పరులకొరకైనా చాలా విలువైనవిగా, సహనాన్ని పరీక్షించే ఘడియలుగా మారుతాయి. ఈ క్షణాలు పరీక్షలోని అతి కఠినమైన ఘడియలు.

సృష్టిశ్రేష్ఠులు ప్రవక్త(స) పరలోక ప్రస్థానం కొరకు ఎలా సమాయత్తమయ్యారనే విషయాన్ని విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అన్హా) గారి ఉల్లేఖనం ఆమె (ర.అన్హా) దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చినట్లు ఇలా చెప్పారు : ఆ సమయంలో ఆయన (స) నన్ను ఆనుకొని వున్నారు. **"అల్లాహుమ్మగ్‌ఫిర్‌లీ వర్‌హమ్‌నీ వల్‌హిఖ్‌నీ బిర్రఫీఖిల్ ఆలా"** - "ఓ అల్లాహ్! నన్ను క్షమించు, నాపై కరుణించు, సర్వోన్నతుడవైన ప్రభువా! నన్ను నీలో కలుపుకో." (బుఖారీ, ముస్లిమ్)

నా వద్ద నీటితో నింపిన ఓ పాత్ర ఉండింది. ఆయన (స) ఆ పాత్రలో తన చేతుల్ని ముంచి శుభప్రదమైన తన ముఖంపై నిమురుకుంటూ ఇలా పలికేవారు - అల్లాహుమ్మ అఇన్నీ అలా అమరాతిల్ మౌతి వ సకరాతిల్ మౌతి - ఓ అల్లాహ్! నాకు సహాయపడు, కఠినమైన చావునుంచి, దాని కష్టాల నుంచి. (తిర్మిజీ)




## దేశంలో మూడింట రెండు వంతులు పనిచేసే వయసువారే

దేశ జనాభాలో పని చేసే వయసు ప్రజలు మూడింట రెండు వంతులు ఉన్నారు. మొత్తం జనాభాలో 66 శాతం మంది పని చేసే వయసు (15-59) విభాగంలో ఉన్నారని నమూనా నమోదు సిస్టం గణాంక నివేదిక 2023 వెల్లడించింది. ఈ విభాగంలో ఢిల్లీలో ఎక్కువ మంది ప్రజలు నివసిస్తున్నారు. తర్వాత స్థానాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. ఇక బాలల విభాగంలో జనాభా భారీగా తగ్గిపోయింది. మొత్తం జనాభాలో 0-14 ఏళ్ల విభాగంలో 24.2 శాతం ఉన్నట్లు నివేదిక పేర్కొంది. పని చేసే విభాగంలో ప్రజల సంఖ్య మాత్రం పెరిగింది. నివేదిక ప్రకారం.. ఢిల్లీలో 70.8 శాతం వర్కింగ్ ఏజ్‌లో ఉన్నారు. తెలంగాణలో 70.2 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 70.1 శాతం ప్రజలున్నారు. మొత్తం జనాభాలో పట్టణ వర్కింగ్ ఏజ్ గ్రూప్ జనాభా 68 శాతంగా ఉంది.

## దేశంలో పెరుగుతున్న మిలియనీర్ల సంఖ్య

దేశంలో మిలియనీర్ కుటుంబాల (ఒక మిలియన్ డాలర్లు లేదా రూ.8.5 కోట్ల నికర విలువ ఉన్నవి) సంఖ్య కేవలం 4 ఏళ్లలో 90 శాతం పెరిగింది. 2021లో వీటి సంఖ్య 4,58,000 లక్షల నుంచి 2025లో ఏకంగా 8,71,700కు ఎగబాకింది. 2017-2025 మధ్య మిలియనీర్ కుటుంబాల సంఖ్య ఏకంగా 445 శాతం పెరగడం విశేషం. దేశంలోని మొత్తం కుటుంబాల్లో.. ఇవి 0.31 శాతం. రాష్ట్రాల్లో మహారాష్ట్ర అత్యధిక మిలియనీర్ కుటుంబాలతో నంబర్ వన్ స్థానంలో ఉంటే.. నగరాల్లో ముంబై టాప్లో నిలిచింది. ఇలాంటి ఆసక్తికర విషయాలు 'మెర్సిడెజ్ బెంజ్ హురున్ ఇండియా వెల్త్ రిపోర్ట్ 2025'లో వెల్లడయ్యాయి.

## రెండున్నర రెట్లు పెరిగిన ఖర్చు

దేశంలోని అన్ని రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. గత దశాబ్ద కాలంలోనే రాష్ట్రాల రుణభారం ఏకంగా మూడు రెట్లు పెరిగిపోవడంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 2013-14 ఆర్థిక సంవత్సరం నాటికి 28 రాష్ట్రాల అప్పులు రూ.17.57 లక్షల కోట్లు ఉండగా, 2022-23 నాటికి రూ.59.60 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించింది. దీంతో పాటుగా అప్పులు, రాష్ట్రాల అభివృద్ధి అవకాశాలకు ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లపై కాగ్ తాజా నివేదికలో పలు కీలక అంశాలను ప్రస్తావించింది. రాష్ట్రాలు ఎక్కువగా వేతనాలు, పింఛన్లు, రుణాల వడ్డీల చెల్లింపులపై అధిక భాగం వ్యయం చేస్తున్నట్లు పేర్కొంది. ఈ ఖర్చు అన్ని రాష్ట్రాల వ్యాప్తంగా పదేళ్లలో 2.49 రెట్లు పెరిగిందని తెలిపింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 6.26 లక్షల కోట్లు ఉండగా.. 2022-23 అది ఏకంగా 15.63 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించింది. ఈ మొత్తం రాష్ట్రాల మొత్తం రెవెన్యూ వ్యయంలో దాదాపు సగమని తెలిపింది. ఇంకా సబ్సిడీలు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌లను కలిపితే.. రాష్ట్రాలు చేసే వ్యయంలో ప్రతి రూపాయిలో ఐదింటిలో నాలుగుకు పైగా వంతు వాటికే పోతోందని వివరించింది. జీతాలు, పెన్షన్లు, ప్రభుత్వ అప్పులపై వడ్డీ చెల్లింపులను 'నిబద్ధ వ్యయం'గా పరిగణిస్తారు. 2013-14, 2022-23 మధ్య రాష్ట్రాల మొత్తం వ్యయంలో రెవెన్యూ వ్యయం స్థిరంగా 80-87 శాతం నడుమ ఉంటోంది. రాష్ట్రాల మొత్తం జీఎస్డీపీలో ఆ వాటా 13-15 శాతం మధ్య ఉంది. 2022-23 ఆర్థిక ఏడాది వరకు చూస్తే.. రెవెన్యూ వ్యయం రూ.35.96 లక్షల కోట్లుగా ఉంది. ఇది మొత్తం వ్యయంలో 85 శాతం, మొత్తం జీఎస్డీపీలో 13.85 శాతం. 2022-23లో మొత్తం రెవెన్యూ వ్యయంలో వేతనాలు, పింఛన్లు, రుణాలకు వడ్డీ వంటి వాటికి రూ.15.63 లక్షల కోట్లు ఖర్చు చేయగా, సబ్సిడీలు రూ.3.09 లక్షల కోట్లకు చేరాయి.

## అన్ని రాష్ట్రాల్లో 'సర్'

దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్)ను చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ సిద్ధమవుతున్నది. 'సర్' కోసం రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు (సీఈవో) ఈ నెల 30లోగా సిద్ధంగా ఉండాలని ఈసీ కోరింది. ప్రతి రాష్ట్రంలో చివరిసారి చేపట్టిన 'సర్' ఆధారంగా ఓటర్ల జాబితాను సవరించాల్సి ఉంటుందని ఈసీ గుర్తు చేసింది. ఈ క్రమంలో ఇంతకు ముందు ప్రచురించిన రాష్ట్రాల ఓటర్ల జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు ఈసీ తెలిపింది. ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని (సర్) అక్టోబర్- నవంబర్ నాటికి ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని ఈసీ సూత్రప్రాయంగా వివరించింది. 2008లో ఢిల్లీలో, 2006లో ఉత్తరాఖండ్‌లో, 2003లో బిహార్‌లో చివరిసారిగా 'సర్'ను నిర్వహించారు. మిగతా రాష్ట్రాల్లో ఈ ప్రక్రియను 2002 నుంచి 2004 మధ్య పూర్తి చేశారు. పలు రాష్ట్రాల సీఈవోలు ఇప్పటికే ఈ జాబితాలను వెబ్‌సైట్లలో అప్‌లోడ్ కూడా చేశారు. కాగా బిహార్ తర్వాత దేశవ్యాప్తంగా 'సర్'ను అమలు చేస్తామని ఈసీ ప్రకటించింది.

## పారాసిటమాల్ సురక్షితమైంది : డబ్ల్యూహెచ్‌వో

పెయిన్ కిల్లర్ టైలినాల్ (ఇండియాలో పారాసిటమాల్)ను గర్భిణీ స్త్రీలు వాడకూడదని ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ డ్రగ్ వాడకం వల్ల ఆటిజం పిల్లలు పుట్టే అవకాశాలు ఉన్నట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) కొట్టి పారేసింది. ప్రెగ్నెన్సీ సమయంలో పారాసిటమాల్ ట్యాబ్లెట్లను వాడడం వల్ల ఆటిజం పిల్లలు పుట్టే అవకాశాలు ఉన్నాయన్న వాదనకు ఆధారాలు లేవని డబ్ల్యూహెచ్‌వో పేర్కొన్నది. జెనీవాలో డబ్ల్యూహెచ్‌వో ప్రతినిది తారిక్ జాసరవిక్ మాట్లాడుతూ.. టైలినాల్, ఆటిజం మధ్య ఉన్న లింకు అంశంలో ఆధారాలు సరిగా లేవన్నారు. వ్యాక్సిన్ల వల్ల ఆటిజం రాదన్న విషయం తెలుసు అని, టీకాలు కోట్లాది మంది ప్రాణాలను కాపాడుతున్నాయని, శాస్త్రీయంగా దీని నిర్ధారణ జరిగిందని, దీన్ని ప్రశ్నించలేమని డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి తారిక్ తెలిపారు.

## నోబెల్ బహుమతి రావాలంటే ట్రంప్ ఆ పని చేయాలి

నోబెల్ శాంతి బహుమతి కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెగ ఉవ్విళ్లూరుతున్న సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయనకు నోబెల్ బహుమతి కావాలంటే గాజాలో యుద్ధం ఆపాలన్నారు. ఐరాస సమావేశం కోసం మెక్రాన్ (Emmanuel Macron) అమెరికాకు వచ్చారు. ఈ క్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐరాస సమావేశంలో 'నాకు శాంతి కావాలి. నేను అనేక యుద్ధాలు పరిష్కరించాను' అంటూ అమెరికా అధ్యక్షుడు పేర్కొన్న విషయాన్ని మెక్రాన్ ప్రస్తావించారు.

సర్వత్రా

యుద్ధం ఆపిన వారికే నోబెల్ శాంతి బహుమతి వస్తోందని, గాజాలో ఇంకా మారణహోమం ముగియలేదని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు ఇస్రాయీల్‌పై ఒత్తిడి తెచ్చే శక్తి యూఎస్‌కు మాత్రమే ఉందన్నారు. ట్రంపే అది చేయగలరని ఆశాభావం వ్యక్తంచేశారు. ట్రంప్ గాజా యుద్ధాన్ని ముగించడంలో విజయం సాధిస్తేనే ఆయనను నోబెల్ బహుమతి వరిస్తుందన్నారు.

## హెచ్-1బీ ఎంపిక విధానంలో మార్పులు!




అత్యంత నైపుణ్యమున్న విదేశీయులకే హెచ్-1బీ వీసా ప్రక్రియలో అధిక ప్రాధాన్యత కల్పించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే హెచ్-1బీ వీసా వార్షిక రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు పెంచిన ట్రంప్ సర్కార్ తాజాగా తక్కువ నైపుణ్యమున్న విదేశీయులకు హెచ్-1బీ వీసా దక్కకూడదనే ప్రయత్నానికి తెరతీసింది. ఏటా ఇచ్చే 85వేల హెచ్-1బీ వీసాల పరిమితి దాటాక సంస్థల నుంచి వచ్చే అభ్యర్థనల్లో అత్యధిక నైపుణ్యంతో అధిక వేతనాలు పొందగల వారికే హెచ్-1బీ వీసాలు జారీ చేయాలని ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు పాత లాటరీ విధానానికి స్వస్తి పలికి అధిక నైపుణ్యం, అధిక వేతనం ఉన్న వాళ్ళకే హెచ్-1బీ వీసాలను కట్టబెట్టాలని భావిస్తోంది. ఈ మేరకు సెప్టెంబర్ 23న ఫెడరల్ రిజిస్టర్ నోటీస్ వెలువడింది.

## పాలస్తీనాకు పెరుగుతున్న మద్దతు

ఇస్రాయీల్ మారణహోమానికి గురవుతున్న పాలస్తీనాకు ప్రపంచ దేశాల నుంచి మద్దతు పెరుగుతోంది. ఐక్యరాజ్యసమితి వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు జరిగిన ఉన్నత స్థాయి సదస్సులో ఫ్రాన్స్ సహా ఆరు దేశాలు పాలస్తీనాను గుర్తించాయి. న్యూయార్క్‌లో సోమవారం సౌదీ అరేబియా, ఫ్రాన్స్ నిర్వహించిన ఈ సదస్సుకు అండోరా, బెల్జియం, లక్సెంబర్గ్, మాల్టా, మొనాకో దేశాల నేతలు హాజరయ్యారు. పాలస్తీనా దేశాన్ని గుర్తిస్తున్నామని వారంతా ముక్తకంఠంతో ప్రకటించారు. పాలస్తీనాను గుర్తించాలంటూ ఆదివారం ప్రతిపాదించిన ఆస్ట్రేలియా, కెనడా, పోర్చుగల్, బ్రిటన్ దేశాల నేతలు కూడా ఈ సదస్సుకు హాజరై ప్రసంగించారు. 'సమయం ఆసన్నమైనందునే ఇక్కడ సమావేశమయ్యాం' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మెక్రాన్ చెప్పారు. ఐరాసలో 193 సభ్య దేశాలు ఉండగా ఏప్రిల్ నాటికి 147 దేశాలు పాలస్తీనాను గుర్తించాయి. ఎనభై శాతానికి పైగా అంతర్జాతీయ సమాజం పాలస్తీనాను గుర్తించడంతో ఇస్రాయీల్‌పై ఒత్తిడి పెరుగుతోంది. అయినప్పటికీ అది గాజాలో విధ్వంసకాండను కొనసాగిస్తూనే ఉంది. స్పెయిన్, నార్వే, ఐర్లాండ్ దేశాలు గత సంవత్సరమే పాలస్తీనాను గుర్తించాయి.

## అల్లాహ్ నామంతో

23వ పేజీ తరువాయి...

జంతువులన్నీ తమ ప్రదేశానికి వెళ్ళిపోయాయి. ఎటు చూసినా భయంకరమైన వాతావరణం! ఎక్కడికి వెళ్ళాలి, ఏమి చెయ్యాలి, ఎవరికీ అర్థం కావడంలేదు. గ్రామ ప్రజలు యూనుస్‌ను ఎప్పుడు హేళన చేసేవారు. ఎందుకంటే 'బిస్మిల్లాహ్' (అల్లాహ్ నామంతో) గురించి చెప్పేవాడు. ఇందులో ఎన్నో శుభాలు ఉన్నాయి అని కష్టాలు కూడా తొలగిస్తాడని చెప్పేవాడు. ప్రజలకు ఈ విషయం ఒక మెరుపులాగా గుర్తుకు వస్తుంది.

గ్రామ ప్రజలు పెద్దఎత్తున యూనుస్ వద్దకు వచ్చి ఎలాగైనా మనపైన వచ్చిన భయంకరమైన తుఫాన్‌ను దైవంతో ప్రార్థించి తొలగించాలని కోరారు. అందరినీ ఒక మైదానంలో పిలిచి 'బిస్మిల్లాహ్' అని దుఆ చేశాడు. కొన్ని నిమిషాలలోనే మేఘాలు వీడిపోయాయి. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు బంద్ అయిపోయాయి. చిమ్మచీకటి తొలగిపోయి మెల్లగా సూర్య కిరణాలు వచ్చేశాయి. పక్షులు, జంతువులు తమ తమ ఆహారం కోసం బయలుదేరాయి.

### దివ్య ఖుర్‌ఆన్‌లో బిస్మిల్లాహ్

ఖుర్‌ఆన్‌లోని 114 సూరాలలో 113 సూరాలు బిస్మిల్లాతోనే ప్రారంభమవుతాయి. ఒక్క సూరె తౌబా మినహా.

హజ్రత్ సులైమాన్ అలైహిస్సలాం రాణి బిల్కిస్‌కి లేఖ రాసినప్పుడు ఆయన లేఖను ఇలా మొదలుపెట్టారు.

కరుణామయుడు, కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభించబడింది. (అన్ నమ్ల్ 27: 30)

నూహ్ అలైహిస్సలాం నౌకలో విశ్వసించిన వారిని ఎక్కించేటప్పుడు ఇలా అన్నారు : ఇందులో ఎక్కండి. అల్లాహ్ పేరుతోనే దాని పయనం కూడా, దాని ఆగటం కూడా. (హూద్ 11: 41)

దివ్య ఖుర్‌ఆన్ మొదలయ్యే మొదటి వాక్యం బిస్మిల్లాహ్‌తోనే.

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. (అల్ ఫాతిహా 1: 1)

దివ్య ఖుర్‌ఆన్‌లో మొదటి వహీ అవతరణ బిస్మిల్లా నామంతోనే (ఓ ప్రవక్తా) పఠించు సర్వాన్ని సృష్టించిన నీ ప్రభువు పేరుతో (అల్ అలఖ్ 96: 1)

కనుక ప్రవక్తా! మహోన్నతుడైన నీ ప్రభువు నామాన్ని స్తుతించు. (అల్ వాఖిఅహ్ 56: 96)


(ఓ ప్రవక్తా!) మహోన్నతుడైన నీ ప్రభువు నామాన్ని కొనియాడు. (అల్ ఆలా 37: 1)

దైవప్రవక్త ముహమ్మద్(స) 'బిస్మిల్లా' గురించి ఇలా తెలిపారు: ఏ పని అయినా బిస్మిల్లాహ్ లేకుండా మొదలైతే అది అసంపూర్ణంగా, దయలేని పనిగా మిగిలిపోతుంది. (అబూ దావూద్)

మీరు ఏ పని ప్రారంభించినా బిస్మిల్లాహ్ అని పలకండి. అది మిమ్మల్ని షైతాన్ నుండి రక్షిస్తుంది. (ముస్నద్ అహ్మద్)

దైవనామ స్మరణ జరుగుతున్నంత కాలం మనిషికి సర్వ శుభాలు సమకూరుతాయి. ఆటంకాలన్నీ తొలగిపోతాయి. మనిషికి తోడునీడగా దైవ సహాయం అందుతుంది ఎల్లప్పుడూ. కావున సర్వవ్యాప్తియైన అల్లాహ్ నామంతోనే మనం ఏ పనైనా ప్రారంభించాలి.

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**